Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03
నెల్లూరు, 14.04.2017, శుక్రవారం సంపుటి : 36 సంచిక : 45 పేజీలు : 12, వెల : ₹ 5


కేర్
డా॥ ఆలూరు స్వరూప్ కుమార్ రెడ్డి M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
సూపర్ స్పెషాలిటి దంత వైద్యశాల
పొగతోట, నెల్లూరు ✆ 9247004747
ఉచిత (క్యాష్‌లెస్) దంత వైద్యసేవలు
• రాష్ట్ర పోలీస్ ఉద్యోగులకు, కుటుంబ సభ్యులకు ఆరోగ్య భద్రత
• రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు EHS (ఎంప్లాయిస్ హెల్త్ స్కీము)

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

## ఢిల్లీ వీధుల్లో...



# బాబు పరువు తీశాడు

→ ఫిరాయింపుల విషయంలో చంద్రబాబు ద్వందనీతిని ఎండగట్టిన జగన్
→ అన్ని పార్టీల నాయకుల దృష్టిలో పలుచబడ్డ చంద్రబాబు ప్రతిష్ట
→ తన పరువు తీసాడని జగన్‌పై ఆక్రోశంతో ఆర్థిక నేరగాడంటూ ఆగ్రహం
→ జగన్‌కు అపాయింట్‌మెంట్ ఇవ్వడంపై బీజేపీ నేతలపై కూడా 'దేశం' అధినేత చిందులు

**తన ప్రభుత్వం అరకొర మెజార్టీతో లేదు... తన ప్రభుత్వం పడిపోయే పరిస్థితి లేదు... అయినా కూడా చంద్రబాబునాయుడు ఆపరేషన్ ఆకర్ష్ మొదలుపెట్టి 21మంది వైసిపి ఎమ్మెల్యేలను తెలుగుదేశంలోకి లాక్కున్నాడు. పలుసార్లు పార్టీ ఫిరాయింపులపై నీతి బోధలు చేసిన చంద్రబాబే చివరకు ఫిరాయింపులను ప్రోత్సహించాడు. సరే అక్కడితో సరిపెట్టుకున్నాడా అంటే అదీ లేదు... అలా గోడదూకి వచ్చిన 21 మందిలో నలుగురికి మంత్రిపదవులిచ్చి ఫిరాయింపు రాజకీయ పైత్యాన్ని పతాక స్థాయికి చేర్చాడు.**

పార్టీ ఫిరాయించే నాయకుల గురించి బీజేపీ జాతీయ నాయకులు, కేంద్రమంత్రి యం.వెంకయ్యనాయుడు చాలా ఘాటుగా మాట్లాడుతుంటారు. ఎలక్షన్‌కో జెండా పట్టే నాయకుల వ్యక్తిత్వం చాలా నీచంగా ఉంటుందని, వాళ్ళు విలువలు లేని వ్యక్తులని ఆయన అభివర్ణిస్తుంటాడు. వెంకయ్యనాయుడిని చంద్రబాబు చాలా దగ్గరగా చూస్తుంటాడు. బీజేపీ మిత్రపక్షంగా వున్న తాను ఇలాంటి (మిగతా 11వ పేజీలో)




# మెట్టు దిగాడు... మెట్లెక్కుతున్నాడు!

✔ వ్యూహం మార్చిన సోమిరెడ్డి
✔ కలహాల కంటే కలుపుకుపోవడం వైపే మొగ్గు
✔ మనిషిని ప్రేమిస్తే వాళ్ళు మనల్ని ప్రేమిస్తారనే 'మిర్చి' ఫార్ములాకు శ్రీకారం

జిల్లా రాజకీయాలలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి మిరపకాయలాంటి వాడు. చూడ్డానికి మిరపకాయ వేలెడంత వున్నా దాని ఘాటు తగిలితే చెట్టంత మనిషయినా గింగిరాలు తిరగాల్సిందే! సోమిరెడ్డి కూడా అంతే! జిల్లాలో కొమ్ములు తిరిగిన రాజకీయ కుటుంబాలను సైతం ఒంటి చేత్తో ఎదుర్కొన్న మనిషి. వర్గ రాజకీయాల్లో బాగా రాటుదేలిన నాయకుడు. అటు ప్రతిపక్ష పార్టీ వాళ్ళకు, ఇటు సొంత పార్టీలోని ప్రత్యర్థులకు ఒకే టైంలో ఒకే నోటితో ఒకే మాటతో సమాధానం చెప్పగలిగిన రాజకీయ ధీశాలి. (మిగతా 12వ పేజీలో)



# ఆశలన్నీ... ఆ మూడింటిమీదే!

• కేంద్రం నియోజకవర్గాలు పెంచడం
• పవన్ పార్టీని పోటీకి నిలపడం
• ఆర్థిక అస్త్రాన్ని ప్రయోగించడం

చంద్రబాబు పక్కా రాజకీయనాయకుడు. కాబట్టే ప్రజానాయకుడు కాక పోయినా ఈ రాష్ట్ర చరిత్రలో అత్యంత ఎక్కువకాలం ముఖ్యమంత్రిగా పరిపాలించిన రికార్డును సొంతం చేసుకున్నాడు. (మిగతా 11వ పేజీలో)

## సంతోష సంరంభాల మధ్య...

# టిఎస్ఆర్ జాతీయ అవార్డులు

### # సినీ దిగ్గజాలతో కళకళలాడిన విశాఖ # ఎటుచూసినా అంబరాన్నంటిన సంబరం





దేశవ్యాప్తంగా తరలివచ్చిన సినీప్రముఖులు, ఎందరో కళాకారులు.. కళాభిమానుల మధ్య, వేలాదిమంది ప్రజల హర్షధ్వానాల మధ్య.. ఎంతో ప్రతిష్టాత్మకమైన టిఎస్ఆర్ జాతీయ అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం అంబరాన్నంటిన సంబరంగా.. ఎంతో వేడుకగా జరిగింది. ఈ అవార్డుల పండుగలో అడుగడుగునా రాజ్యసభ సభ్యుడు, పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఛైర్మెన్, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త.. కళాపోషకుడు..కళాభిమాని టి.సుబ్బరామిరెడ్డి పేరు మారుమ్రోగింది. ఎక్కడ విన్నా ఆయన పేరే, ఎటుచూసినా ఆయనే అన్నట్లుగా.. అన్నీ తానే అయి టిఎస్ఆర్ ఈ కార్యక్రమాన్ని దగ్గరుండి ఆద్యంతం అత్యంత అద్భుతంగా నిర్వహించి అందరి ప్రశంసలు అందుకున్నారు. టిఎస్ఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో టివి-9 సౌజన్యంతో ఈ నెల 8న విశాఖ పోర్ట్ స్టేడియంలో నిర్వహించిన టిఎస్ఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డ్స్-2015-16 కార్యక్రమం ఎంతో ఉల్లాసంగా..ఉత్సాహంగా.. ఉత్తేజభరితంగా జరిగింది. దూర సుదూర ప్రాంతాల నుంచి సైతం విచ్చేసిన ఎందరో సినీదిగ్గజాలు.. సినీ ప్రముఖులతో విశాఖ పోర్ట్ స్టేడియం కళకళలాడింది. తొలుత ఈ అవార్డుల వేడుకను ప్రారంభించి టిఎస్ఆర్ మాట్లాడుతూ, తనకు విశాఖ అంటే ఎంతో ఇష్టమని, అందువల్లే దేశవ్యాప్తంగా వున్న ఉద్దండులైన సినీనటులను ఇక్కడికి ఆహ్వానించి, విశాఖ ప్రజలమధ్య వారికి ఈ విశిష్టమైన జాతీయ అవార్డులను ప్రదానం చేస్తున్నామని అన్నారు. ఈ అవార్డులను ప్రజలే ఎంపిక చేశారని, కనుక ఇవి ప్రజా అవార్డులని, ప్రజల తరఫున తాము ఈ అవార్డులను బహుక రిస్తున్నామని అందరి హర్షధ్వానాల మధ్య అన్నారు. విశాఖ అంటే తనకెంతో ఇష్టమని సుబ్బరామరెడ్డి అనగానే కరతాళధ్వనులు మారు మ్రోగిపోయాయి. ఉప్పొంగిన ఉత్సాహంతో ఈ అవార్డులను ప్రజలందరి సమక్షంలో అత్యంత ప్రతిభావంతులైన సినీప్రముఖులకు ప్రదానం చేయడం తనకెంతో సంతోషంగా వుందని టిఎస్ఆర్ అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ సినీనటుడు, యువరత్న నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ, టిఎస్ఆర్ ఆధ్యాత్మిక, కళాసేవలను కొనియాడారు. శివరాత్రి సందర్భంగా ఆ పర్వదినాన్ని ఎంతో శోభాయ మానంగా నిర్వహించడంతోపాటు ఎంతోమంది సినీకళాకారులకు టిఎస్ఆర్ అవార్డులనిచ్చి ప్రోత్సహిస్తున్నారన్నారు. తనకు తెలుగంటే అత్యంత అభిమానమని, ఎన్టీఆర్ అంటేనే ఎనలేని ఆత్మీయతతో రక్తం ఉప్పొంగు తుందన్నారు. విశాఖతో తనకెంతో అనుబంధం వుందని బాలయ్య అంటూ, సాహసమే జీవితం, బాబాయి-అబ్బాయి, లారీ డ్రైవర్, సమర సింహారెడ్డి, నరసింహనాయుడు వంటి ఎన్నో సినిమాలను విశాఖలో నిర్మించారన్నారు. అక్కినేని నాగార్జున మాట్లాడుతూ, విశాఖలో టిఎస్ఆర్ నుంచి అవార్డు స్వీకరించడం తనకెంతో సంతోషంగా వుందన్నారు. ఎంతోమంది సినీ కళాకారులను విశాఖకు ఆహ్వానించి టిఎస్ఆర్ జాతీయ అవార్డులను ఇచ్చి గౌరవించడం ఎంతో అభినందనీయమన్నారు. మోహన్ బాబు మాట్లాడుతూ, నిరంతర కృషి-పట్టుదలతోనే తాను ఈ స్థాయికి వచ్చానన్నారు. టిఎస్ఆర్ ఆహ్వానంతో తానిక్కడకి వచ్చానని, ఈ అవార్డు స్వీకరించడం తనకెంతో ఆనందకరమన్నారు. ఈ సందర్భంగా ఆయన "నిన్నటి కోసం మాట్లాడను.. రేపటికి ఏదీ వాయిదా వేయను.. భవిష్యత్తు కోసం మరచిపోను"..అనే డైలాగ్ చెప్పి అందరి కరతాళధ్వనులందుకు న్నారు. సుమ యాంకరింగ్‌తో ఈ కార్యక్రమం ఉల్లాసంగా సాగింది.

### ఎందరో ప్రముఖులు.. ప్రతిభావంతులకు

## టిఎస్ఆర్ జాతీయ అవార్డులు

ఈ అవార్డుల పండుగలో ప్రముఖంగా 2015 సంవత్సరానికి 'గోపాల గోపాల' చిత్రానికిగాను 'బెస్ట్ యాక్టర్' అవార్డును ప్రముఖ హీరో వెంకటేష్‌కు, 'బాహుబలి' చిత్రానికి స్పెషల్ జ్యూరీ విభాగంలో బెస్ట్ పర్ఫార్మన్స్ అవార్డును రానాకు ప్రకటించగా, వీరిద్దరి తరఫున అవార్డులను సురేష్‌బాబు స్వీకరించారు. ఫైవ్ డికేడ్స్ స్టార్ అవార్డును కృష్ణంరాజుకు హేమమాలిని చేతుల మీదుగా అందజేశారు. బాహుబలి చిత్రానికి గాను నేషనల్ స్టార్ అవార్డును ప్రభాస్ తరఫున కృష్ణంరాజు అందుకున్నారు. ఫోర్ డికేడ్స్ స్టార్ అవార్డును మోహన్‌బాబుకు ప్రకటించగా, ఆయన తరఫున కుమార్తె మంచు లక్ష్మి ఆ అవార్డును స్వీకరించారు. బెస్ట్ యాక్ట్రెస్ అవార్డును 'దొంగాట' చిత్రంలో నటించిన మంచు లక్ష్మికి బహుకరించారు. 2016కు బెస్ట్‌యాక్టర్‌గా 'సోగ్గాడే చిన్నినాయనా' చిత్రంలో నటించిన అక్కినేని నాగార్జునకు బహుక రించారు. నాగచైతన్య నటించిన 'ప్రేమమ్' చిత్రానికి లభించిన స్పెషల్ అప్రీసియేషన్ అవార్డును నాగ్ అందుకున్నారు.

మిలీనియం స్టార్ అవార్డులు ప్రముఖ బాలీవుడ్ నటులు హీరో శత్రుఘ్నసిన్హా, హేమమాలినికి లభించాయి. సెన్సేషనల్ స్టార్ అవార్డు జాకీష్రాఫ్, లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ బప్పీలహరి, స్పెషల్ జ్యూరీ అవార్డు రేవంత్ (ఇండియన్ ఐడల్ విన్నర్) అందుకున్నారు.

అదేవిధంగా, 2015కిగాను బెస్ట్ హీరోగా అల్లు అర్జున్ (సన్నాఫ్ సత్యమూర్తి), బెస్ట్ ఔట్‌గోయింగ్ పర్ఫార్మన్స్‌కు కూడా అల్లు అర్జున్ (రుద్రమదేవి) అవార్డులను దక్కించుకున్నారు. బెస్ట్ యాక్ట్రెస్‌గా శ్రియ (గోపాల గోపాల), బెస్ట్ హీరోయిన్‌గా రకుల్‌ప్రీత్‌సింగ్ (బ్రూస్‌లీ, పండగ చేస్కో), బెస్ట్ డెబ్యూ హీరోగా ఆకాశ్‌పూరి(ఆంధ్రాపోరి), బెస్ట్ డైరెక్టర్‌గా గుణశేఖర్ (రుద్రమదేవి), బెస్ట్ విలన్‌గా ముకేష్‌రుషి (శ్రీమంతుడు), బెస్ట్ కెమెడియన్‌గా ఆలీ (సన్నాఫ్ సత్యమూర్తి), బెస్ట్ మ్యూజిక్‌డైరెక్టర్‌గా దేవిశ్రీ ప్రసాద్(సన్నాఫ్ సత్యమూర్తి) అవార్డులను అందుకున్నారు.



## 2016 సంవత్సరానికి మరిన్ని అవార్డులు

2016 సంవత్సరానికిగాను అందించిన అవార్డుల్లో బెస్ట్ హీరోగా బాలకృష్ణ (డిక్టేటర్), బెస్ట్ యాక్టర్‌గా నాగార్జున (సోగ్గాడే చిన్ని నాయనా), స్పెషల్ జ్యూరీ బెస్ట్ యాక్టర్‌గా రామ్‌చరణ్(ధృవ), స్పెషల్ జ్యూరీ అవార్డు నానీ(జెంటిల్మన్), బెస్ట్ యాక్ట్రెస్ అవార్డు రకుల్‌ప్రీత్‌సింగ్ (ధృవ, నాన్నకు ప్రేమతో), బెస్ట్ హీరోయిన్ అవార్డు కేథరిన్ (సరైనోడు), బెస్ట్ డెబ్యూ హీరోయిన్ అవార్డు నివేదా థామస్ (జెంటిల్మన్), బెస్ట్ డైరెక్టర్‌గా సురేందర్‌రెడ్డి (ధృవ) అవార్డులను అందుకున్నారు. బెస్ట్ ఫిల్మ్‌గా ఊపిరి ఎంపికైంది. బెస్ట్ కెమెడియన్‌గా బ్రహ్మానందం(బాబూ బంగారం), బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా ఎస్‌ఎస్ థమన్ (సరైనోడు, శ్రీరస్తు-శుభమస్తు) అవార్డులను అందుకున్నారు. 2015-16 సంవత్సరానికి గాను నేషనల్ స్టార్ అవార్డును ప్రభాస్(బాహుబలి) దక్కించుకోగా, స్పెషల్ జ్యూరీఅవార్డు ఫర్‌ది బెస్ట్ పర్ఫార్మన్స్‌గా రానా(బాహుబలి), స్పెషల్ జ్యూరీ అవార్డులను కళ్యాణ్‌రామ్ (పటాస్), బెస్ట్ డైరెక్టర్‌గా క్రిష్(కంచె), బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్‌గా మణిశర్మ(లయన్), బెస్ట్ డైరెక్టర్‌గా ఇంద్రగంటి మోహన్‌కృష్ణ(జెంటిల్మన్) అవార్డులందుకున్నారు. బెస్ట్ ఆల్‌రౌండ్ యాక్టర్‌గా రాజేంద్రప్రసాద్ (నాన్నకు ప్రేమతో), స్పెషల్ అప్రీసియేషన్ యాక్టర్‌గా శర్వానంద్ (ఎక్స్‌ప్రెస్ రాజా), స్పెషల్ అప్రీసియేషన్ హీరోగా నారా రోహిత్ (జో అచ్యుతా నంద), బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్‌గా మాస్టర్ ఎన్టీఆర్ (దానవీరశూర కర్ణ), తమిళంలో బెస్ట్ యాక్టర్‌గా మాధవన్, బెస్ట్ యాక్ట్రెస్‌గా హన్సిక, కన్నడంలో బెస్ట్ యాక్ట్రెస్‌గా కన్నడ ప్రియమణి, బెస్ట్ డెబ్యూ యాక్టర్‌గా నిఖిల్‌గౌడ అవార్డులను అందుకున్నారు. ఇంకా నటీమణులు జయప్రద, మీనలతో పాటు రాజీవ్‌రెడ్డి, ముఖేష్‌రుషి, నదియా, ఊర్వశిరౌతుల, ఆకాష్, దీపక్‌సరోజ్, సురేష్‌బాబు, జాకీ అవార్డులు స్వీకరించారు. విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి పాల్గొని టిఎస్ఆర్ సేవలను అభినందించారు. రాష్ట్ర మంత్రులు అయ్యన్నపాత్రుడు, గంటా శ్రీనివాసరావు, ఎంపి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# నెల్లూరులో డిజిపి పర్యటన



ఆంధ్రప్రదేశ్ డిజిపి నండూరి సాంబశివరావు 13వ తేదీ నెల్లూరొచ్చారు. మొదట కృష్ణపట్నంపోర్టులో ఇండియన్ కోస్ట్‌గార్డ్ నౌక చార్లీ423ని ప్రారంభించారు. నెల్లూరు ఐదో నగర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన అధునాతన రిసెప్షన్ వ్యవస్థను, ఆఫ్టిసస్ సాఫ్ట్‌వేర్‌ను ఆయన ప్రారంభించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అధునాతన ఇంటిగ్రేటెడ్ కమాండ్‌కంట్రోల్ సిస్టంను ఆయన ప్రారంభించారు. అదేరోజు సాయంత్రం పోలీస్‌గ్రౌండ్‌లో జరిగిన ఎస్పీ క్రికెట్ కప్ పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ విశాల్‌గున్నీ, ఏఎస్పీ శరత్‌బాబులతో పాటు డిఎస్పీ, సిఐలు కూడా పాల్గొన్నారు.



# నెలరోజుల్లో శివాజీనగర్ బ్రిడ్జి

ఈ నెల 13వ తేదీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి 31, 32 డివిజన్‌లలో ప్రజాబాట నిర్వహించారు. స్థానిక సమస్యలపై ప్రజలతో చర్చించారు. శివాజీనగర్ ప్రజలు బ్రిడ్జి లేక తాము గత 20ఏళ్లుగా నానా బాధలు పడుతున్నామని, వర్షాల సమయంలో చిన్నపిల్లలు, వృద్ధులు కాలువలో పడి ప్రమాదాలకు గురవుతున్నారని శ్రీధర్‌రెడ్డికి చెప్పారు. దీనికి స్పందించిన కోటంరెడ్డి శివాజీనగర్ బ్రిడ్జి ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరికని, గత 6 నెలలుగా ఈ బ్రిడ్జి సాధన కోసం తాను తిరగని అధికారి లేడని, ఎట్టకేలకు దేవుడి దయ వల్ల రాజ్యసభసభ్యుల నిధుల కోటాలో ఈ బ్రిడ్జి సాధించామని, 30రోజుల్లో శివాజీనగర్ బ్రిడ్జిని నిర్మించి, ప్రజలకు అందిస్తానని చెప్పారు. ఎమ్మెల్యేలకి ఒక్క రూపాయి గ్రాంటు రావడం లేదని, ఎమ్మెల్యేల గ్రాంటుకు చాలా ఇబ్బందులు, శ్రమ పడాల్సి వస్తుందని, అయినా శక్తికి మించి ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా అభివృద్ధి పనులు సాధిస్తున్నానని చెప్పారు.

# నారాయణ గ్రాడ్యుయేషన్‌డే!




ఇటీవల నారాయణ వైద్యకళాశాల గ్రాడ్యుయేషన్ డే ఘనంగా జరిగింది. కోర్సు పూర్తిచేసిన 149మంది వైద్యవిద్యార్థులకు పుదుచ్చేరి జిపమర్ డీన్ డాక్టర్ విష్ణుభట్ చేతులమీదుగా పట్టాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్యకళాశాల ప్రిన్సిపాల్ నాగిరెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ నరసింహారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శ్రీరాం సతీష్, డాక్టర్ రామ్మోహన్, డాక్టర్ విజయమోహన్‌రెడ్డి, సిఇఓ డాక్టర్ సుబ్బారావు, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ జితేంద్ర, ఏజిఎం సి.హెచ్.భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

# భారీ బడ్జెట్... భారీ అంచనాలు


## రూ.1084కోట్లకు ఆమోదం



గతంలో ఎన్నడూ లేని విధంగా రూ.1,084కోట్ల భారీ బడ్జెట్‌కు నెల్లూరు కార్పొరేషన్ పాలకమండలి బుధవారం ఆమోదం తెలిపింది. ఇందు కోసం ఆరు గంటలకు పైగా సుదీర్ఘ చర్చ జరిగింది. అధికార, ప్రతిపక్ష సభ్యుల సూచనలు, సలహాలు, అక్రమాలు, అవినీతిపై సభ్యుల నిలదీతల మధ్య మొత్తంమీద ప్రశాంతం గానే బడ్జెట్ సమావేశం జరిగింది. ఒక దశలో వైసిపి, టిడిపి నేతల సవాళ్ళు, కార్పొరేటర్ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి. బడ్జెట్ అజెండాలో పెట్టిన ప్రతి అంశంపై కార్పొరేటర్లు అర్థవంతంగా చర్చ నిర్వహించారు. అజెండాలో లోపాలు, అధికారుల తప్పుల తడకను ఎత్తిచూపారు. తీవ్ర చర్చ అనంతరం ఈ ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌ను కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. హడ్కో రుణభారం నగర ప్రజలపై పడే ప్రసక్తేలేదని మేయర్ అబ్దుల్ అజీజ్ కౌన్సిల్ సభ్యులకు వివరించారు. హడ్కో పథకంతో నెల్లూరు నగరంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పథకాల పనులు జరుగుతున్న నేపథ్యంలో కౌన్సిల్ సమావేశంలో చర్చ జరిగింది. డిప్యూటీమేయర్ ముక్కాల ద్వారకానాథ్, వైసిపి విప్ బొబ్బల శ్రీనివాసయాదవ్ మాట్లాడుతూ హడ్కో రుణభారంపై మేయర్‌ను ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు నెల్లూరు నగర వాసులు అయినప్పటికి నగరానికి గ్రాంట్ రూపంలో కాకుండా రుణంగా రూ.1100 కోట్లు నిధులు ఇచ్చి ఆ భారం కార్పొరేషన్‌పై మోపడం ఏమిటని ప్రశ్నించారు. గుంటూరు, విజయవాడ కార్పొరేషన్‌లకు గ్రాంట్‌గా ఇచ్చి, నెల్లూరుకు రుణం ఇవ్వడం సరికాదన్నారు. ఈ భారం ప్రజలు మోయలేరని చెప్పారు. దీంతో మేయర్ అజీజ్ మాట్లాడుతూ హడ్కో రుణభారం ప్రజలపైన ఎట్టి పరిస్థితుల్లో వేసేది లేదన్నారు. హడ్కో సంస్థకు నెలనెలా చెల్లించాల్సిన వడ్డీని రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని, దీనికి సంబంధించి బడ్జెట్‌లో నిధులు కూడా కేటాయించారని చెప్పారు. అలాగే రుణాన్ని అమృత్ పథకం నిధులతో చెల్లిస్తామన్నారు. దీంతో ప్రజలపైన ఒక్కపైసా కూడా భారం పడదని, దీనిని ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయడం సరికాదన్నారు. అనంతరం రూప్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ గత ఏడాది మిగులు బడ్జెట్ రూ.98కోట్లు ఉంటే ఏడు నెలలుగా కార్మికులకు ఎందుకు జీతాలు చెల్లించలేదని ప్రశ్నించారు. దీనికి కమిషనర్ సమాధాన మిస్తూ కార్మికుల నియామకాలకు సంబంధించి ఇటీవలే స్టాండింగ్ కమిటి అప్రూవల్ లభించిందని, డిఎంఏ అప్రూవల్ కూడా తీసుకుని త్వరలోనే జీతాలు చెల్లిస్తామన్నారు. భవిష్యత్‌లో ఇటువంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఆదేశాలు ఇచ్చినట్లు వివరించారు.

# 18 నుండి షిరిడి సాయిబాబా, యోగాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు





నెల్లూరుజిల్లా ఇందుకూరుపేట మండలం కొత్తూరు గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబా, శ్రీ యోగాంజనేయస్వామి వార్ల బ్రహ్మోత్సవాలు ఈ నెల 18 నుండి 22వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ధర్మకర్తలు కలికి శ్రీలత, కలికి కోదండరామిరెడ్డి తెలిపారు. 19వ తేదీ బుధవారం ఉదయం 11గంటలకు శ్రీ సాయినాథునికి బ్రహ్మకళశాభిషేకం, 21వ తేదీ శుక్రవారం సాయంత్రం 5గంటల నుండి శ్రీ షిరిడిసాయినాథ, శ్రీరామ, శ్రీ ఆంజనేయ పరివార దేవతామూర్తుల రథోత్సవం నేత్రపర్వంగా జరుగుతుందన్నారు. 22వ తేదీ శనివారం ఉదయం 11గంటలకు శ్రీ యోగాంజనేయస్వామి వారికి బ్రహ్మకళశాభిషేకం అత్యంత వైభవంగా జరుగుతుందన్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని, భక్తులు వేలాదిగా విచ్చేసి శ్రీ స్వామివార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలని వారు కోరారు.

# 16న బీద స్మారక అవార్డుల ప్రదానోత్సవం



నెల్లూరు, కళాంజలి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీ ఆది వారం సాయంత్రం నెల్లూరు టౌన్‌హాలులో బీద రమణయ్య, బీద బుజ్జమ్మ స్మారక అవార్డులను సినీ రచయిత వై.కాశీవిశ్వనాథ్, న్యూరాలజిస్ట్ డా॥ మల్లి దొరసానమ్మలకు ప్రదానం చేయనున్నట్లు సంస్థ అధ్యక్షులు కళాంజలి అనంత్ తెలిపారు. గురువారం విలేకర్లతో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా 'లాయర్' వారపత్రిక సంపాదకులు తుంగా శివప్రభాత్‌రెడ్డి వ్యవహరిస్తారని తెలిపారు. కళాంజలి అవార్డులను సినీ రచయిత, దర్శకులు నాగభైరవ వీరబాబు, సినీ అండ్ టివి దర్శకులు అళహరి, మిమిక్రీ ఆర్టిస్ట్, జబర్దస్త్ ఫేం శాంతికుమార్‌లకు ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. విశిష్ట అతిథులుగా ఏపి రాజధాని నిర్మాణ కమిటి సభ్యులు బీద మస్తాన్‌రావు, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ కిలారి వెంకటస్వామి నాయుడు, వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటి కమిషనర్ ఎస్.ఇ.కృష్ణమోహన్‌రెడ్డి, మురళీకృష్ణ హోటల్స్ ఎం.డి వీరిశెట్టి హజరత్‌బాబు, కావలి మార్కెటింగ్ కమిటి ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యంయాదవ్, హిందూ ధర్మ పరిరక్షణ కమిటి కో-ఆర్డినేటర్ కోట సునీల్, ప్రముఖ పారిశ్రామిక వేత్త మాగుంట శరత్‌చంద్రారెడ్డి, కవి చిన్ని నారాయణరావులు పాల్గొంటున్నారని తెలిపారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరి, నృత్యప్రదర్శన, మిమిక్రీ జరుగుతాయన్నారు. సింహపురీయులు పాల్గొని జయప్రదం గావించాలని కోరారు.




## 'ప్రభా'తం

# దాయాది దుర్నీతి

**ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్న పాక్..ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కంకణం కట్టుకున్న భారత్‌ను ఎలాగైనా ఇరుకున పెట్టాలని కుట్రలు పన్నుతోంది. ఆ కుయుక్తుల్లో భాగమే అమాయకుడైన కుల్‌భూషణ్ జాదవ్‌కు మరణశిక్ష విధించడం. పాక్ అరాచకపు ప్రవృత్తికి ఇది మరో నిదర్శనం. ఇకనైనా..పాక్ ఇలాంటి కుయుక్తులను మానుకోవాలి. అలాంటి చర్యలు ఇరుదేశాల మధ్య సౌహార్ధ్రపూరితమైన మంచి సంబంధాలను దెబ్బతీస్తాయి. అలాంటి దుష్పరిణామాలకు దారివ్వకపోవడమే ఉత్తమం.**

ఉగ్రవాదానికి పుట్టినిల్లుగా వుంటూ, పాముకి పాలుపోసినట్లు.. ఉగ్రవాదాన్ని అదేపనిగా పెంచి పోషిస్తున్న పాకిస్తాన్..కుయుక్తుల పన్నడంలోనూ దిట్టగా పేరుపొందింది. బ్లాక్‌మెయిల్ రాజకీయాల్లోనూ అది అందెవేసిన చేయి. ఉగ్రవాదాన్ని కూకటివేళ్ళతో సహా పెకలించివేయాలని, ఉగ్రవాదం నిర్మూలనకు ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాలు సమాయత్తం కావాలని భారత ప్రధాని మోదీ పదేపదే పిలుపునిస్తున్న నేపధ్యంలో, ఉగ్రవాద పుట్టగా తయారైన పాక్ నానాటికీ ఉక్కిరిబిక్కిరవుతోంది. అంతర్జాతీయ సమాజంలో తానెక్కడ ఒంటరిదైపోతానేమోననే భీతితో..భారత్‌ను ఎలాగైనా వేధించాలని రకరకాల కుయుక్తులు పన్నుతోంది. అలాంటి కుయుక్తుల్లో భాగమే జాదవ్‌కు మరణశిక్ష విధించడం. అమాయకుడైన కుల్‌భూషణ్ జాదవ్‌కు మరణశిక్ష విధించి, తద్వారా భారత్‌ను ఆందోళనకు గురిచేయాలని చూడడం... పాక్ కుట్రలకు..అరాచకపు ప్రవృత్తికి నిదర్శనం.

భారత దేశానికి చెందిన నౌకాదళ మాజీ అధికారి, ప్రస్తుతం వ్యాపారిగా వున్న కుల్‌భూషణ్ జాదవ్‌ను అరెస్ట్ చేసి, ఆయనకు మరణశిక్ష విధించడం ద్వారా పాక్ ఇప్పుడు మరో వివాదానికి తెరతీసింది. పాక్ చేస్తున్న ఇలాంటి అరాచకాలను భారత ప్రభుత్వం తీవ్రంగా నిరసిస్తోంది. అయితే, ఇప్పుడే కాదు.. పాక్ ఎప్పుడూ ఇంతే. గతంలోనూ పాక్ ఇలాంటి దుష్కృత్యాలకు పాల్పడిన విషయం ప్రపంచానికంతా తెలిసిందే. సరబ్‌జిత్‌సింగ్ విషయంలోనూ పాక్ ఇలాగే ప్రవర్తించింది. పాక్ భూభాగంలోకి పొరపాటున ప్రవేశించిన సరబ్‌జిత్ సింగ్ అనే పశువుల కాపరిని దేశద్రోహం నేరంపై అరెస్ట్ చేసి దాదాపు ఇరవై రెండేళ్ళ పాటు నిర్బంధం విధించింది. ఆయన్ను విడుదల చేయాలని అప్పట్లో మన్మోహన్‌సింగ్ ప్రభుత్వం ఎన్నిసార్లు సంప్రదింపులు జరిపినా పాక్ ససేమిరా అంది. చివరికి సరబ్‌జిత్ పాక్ జైలులోనే అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. ఇప్పుడు తాజాగా కులభూషణ్ జాదవ్‌ది ఇలాంటి వ్యధ గానే వుంది.. జాదవ్ వ్యాపారరీత్యా ఇరాన్ వెళ్తే, అక్కడ పాక్ భద్రతాదళాలు అరెస్ట్ చేశాయి. రహస్య గూఢచర్యానికి పాల్పడ్డాడంటూ జాదవ్‌పై అభియోగం మోపాయి. అయితే, జాదవ్‌పై మోపిన అభియోగాలకు న్యాయసహాయం అందించాల్సిన బాధ్యత పాక్ ప్రభుత్వం మీద వున్నా పాక్ పట్టించుకోలేదు. చివరికి అతడిని కలుసుకునే అవకాశం ఇవ్వాలని భారత్ పదేపదే కోరినా పాక్ నిర్ద్వందంగా తిరస్కరించింది. ఇవన్నీ చూస్తే.. జాదవ్ విషయంలో పాక్ కక్ష పూరితంగానే వ్యవహరించిందని ఎవరికైనా ఇట్టే అర్థమవుతుంది. కానీ, ఇలాంటి విషయంలో మనదేశం అలా కాదు. ముంబై దాడుల్లో పట్టుబడిన కసబ్‌పై కూడా మన ప్రభుత్వం పారదర్శకమైన విచారణజరిపింది. దారుణమైన దాడులతో 166 మంది మరణానికి కారణమైన కసబ్‌కు మనదేశంలోని ప్రత్యేక న్యాయస్థానంలోనే కాక, ముంబై కోర్టులోను, సుప్రీంకోర్టులోనూ అతనికి న్యాయసహాయం అందించింది. మన న్యాయవ్యవస్థ కారుణ్యానికి ప్రపంచమే ఆశ్చర్యపోయింది. మన దేశం అనుసరించిన తీరుకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి కూడా. అయితే, పాక్ అందుకు పూర్తిగా భిన్నం. జాదవ్‌కు కూడా తాము న్యాయసహాయం అందించామని, మూడు నెలల సుదీర్ఘ విచారణ అనంతరమే జాదవ్‌కు శిక్షను ఖరారు చేశామని, ఏవిధంగానూ తాము న్యాయనిబంధనలను ఉల్లంఘించ లేదని పాక్ చెప్పుకుంటున్నా, అలాంటి విచారణ తాలూకు వివరాలు ఏమీ అందించలేదు. జాదవ్‌ను కలుసుకునేందుకు భారత్ దౌత్య అధికారి 13 సార్లు ప్రయత్నించినా పాక్ అనుమతించకపోవడం ఒక్కటి చాలు..పాక్ దుర్నీతికి ఇంతకంటే మరో ఉదాహరణ అక్కర్లేదు.

అంతేకాదు, ఇలాంటి విషయాల్లో న్యాయబద్ధంగా అనుసరించాల్సిన విధివిధానాలను సైతం పాటించకపోవడం పట్ల పాక్ తీరు ఎన్నో అనుమానాలకు దారితీస్తోంది. అసలు కుల్‌భూషణ్ జాదవ్ నేరం చేసినట్లు తగిన ఆధారాలేమీ లేవని, ఆయన వద్ద భారత్ పాస్‌పోర్ట్ కూడా వుందని, అటువంటప్పుడు ఆయన గూఢచారి ఎలా అవుతారని భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రశ్న ఎంతైనా సహేతుకమైనదే. అంతేకాక, జాదవ్ ఎలాంటి గూఢచర్యాలకూ పాల్పడ లేదని, వ్యాపార నిమిత్తం ఇరాన్ వెళ్ళి వస్తుండగా, పాక్ భద్రతాదళాలు అరెస్ట్ చేశాయని, జాదవ్‌కు పూర్తిస్థాయిలో న్యాయం చేసేందుకు ప్రయత్నిస్తామనడం ఎంతైనా సముచితమైనదే. ఒకవేళ జాదవ్‌కు ఏమైనా జరిగితే ఆ తరువాత జరిగే పరిణామాలకు పాక్ పూర్తిగా బాధ్యత వహించాల్సివుంటుందని మరో వైపు కేంద్రమంత్రి సుష్మాస్వరాజ్ స్పష్టం చేయడం ద్వారా పాక్‌కు భారత్ ఘాటైన హెచ్చరికను చేసినట్లే. జాదవ్ గూఢచారి కానేకాదని, అమాయకుడైన జాదవ్‌ను ఉరితీస్తే ఊరుకునేది లేదని, అదే జరిగితే తీవ్రపరిణామాలు తప్పవని, ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతింటాయని కూడా భారత్ హెచ్చరిస్తూ, పాక్ తీరు పట్ల నిరసనను తెలియజేసింది. భారత్‌లోని పార్లమెంట్ సభ్యులందరూ పాక్‌ను నిరసిస్తూ.. జాదవ్‌కు తమ మద్దతు ప్రకటించారు. ఇప్పుడన్నింటికన్నా ముఖ్యమైనది.. పాక్ దుశ్చర్యలను ప్రపంచం దృష్టికి తీసుకురావడమే కాక..జాదవ్‌కు ఎలాంటి ప్రాణహాని లేకుండా చూసుకోవడమే భారత్ తక్షణ కర్తవ్యం. జాదవ్ మరణ శిక్షపై 60 రోజుల్లోగా అప్పీల్ చేసుకోవచ్చని పాక్ చెప్తున్నా.. ఆ అప్పీలుపై పాక్ చివరికి ఎలా స్పందిస్తుందో కూడా చెప్పలేం. ఒకవేళ జాదవ్‌కు పాక్ మరణశిక్ష అమలుచేస్తే.. అది ఒక పథకం ప్రకారం చేసిన హత్యగానే పరిగణిస్తామని.. ఆ తర్వాత పరిణామాలు తీవ్రంగా వుంటాయని భారత్ స్పష్టం చేసివున్న నేపథ్యంలో.. చివరికి ఈ అంశం ఇరుదేశాల సంబంధాల మధ్య ఎలాంటి పరిణామాలకు దారితీస్తాయో వూహించలేం.

ఏదేమైనా... భారత్‌ను ఇబ్బందిపెట్టే ఇలాంటి కుయుక్తులు... దుందుడుకు చర్యలను పాక్ మానుకోవాలి.. ఇరాచక ప్రవృత్తిని విడనాడాలి. ఇరుదేశాల మధ్య మంచి సంబంధాలు బాగా కొనసాగేలా చూసుకోవాలి... అదే పాక్‌కు చెప్పదగిన సూచన.

---

• జాతీయ లోక్‌అదాలత్

## శాశ్వత పరిష్కారమే లక్ష్యం



రాజీ ప్రక్రియ ద్వారా కేసులను పరిష్కరించి కక్షిదారులకు శాశ్వత పరిష్కారం అందించడమే జాతీయ లోక్‌అదాలత్ లక్ష్యమని నెల్లూరు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా పేర్కొన్నారు. నెల్లూరుజిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్‌లు నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణంలోని సంస్థ కార్యాలయంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వున్న అపరిష్కృత కేసుల పరిష్కారానికి ఈ లోక్‌అదాలత్ నిర్వహించామని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సత్వర సమన్యాయం పొందారని తెలిపారు.

### జిల్లా వ్యాప్తంగా 718 కేసుల పరిష్కారం

నెల్లూరుజిల్లా వ్యాప్తంగా 10మండలాల పరిధిలో మొత్తం 718 సివిల్, క్రిమినల్, మోటార్ వాహన ప్రమాద కేసులు, చెక్‌బౌన్స్, బ్యాంకు తదితర కేసులు పరి ష్కారమయ్యాయి. ఈ కేసులు పరిష్కారం కావడం వల్ల కక్షిదారులకు రూ. 1,46,51,666 పరిహారంగా లభించింది. జాతీయ లోక్‌అదాలత్ సందర్భంగా ఏడు బెంచ్‌లు ఏర్పాటు చేశారు. వీటికి ప్రిసైడింగ్ అధికారులుగా మూడవ అదనపు జిల్లా జడ్జి బి.పాపిరెడ్డి, సీనియర్ సివిల్‌జడ్జి టి.వి.సుబ్బారావు, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి పీజే సుధ, మేజిస్ట్రేట్ టి.వాసుదేవన్, ఆర్.ఆశీర్వాదం వి.లీలాశ్యామసుందరి, ఏజె పద్మశ్రీ వ్యవహ రించి 251 కేసులను పరిష్కరించారు.

ఈ కార్యక్రమంలో అదనపు జిల్లా జడ్జి శ్యామలాదేవి, శ్రీరామచంద్రమూర్తి, జె.శ్రీలక్ష్మి, సీనియర్ సివిల్‌జడ్జి భూపాల్‌రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు టి.కేశవ, హేమలత, సునీత, వివిధ బ్యాంకులు, ఫైనాన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, కక్షిదారులు, పోలీసు సిబ్బంది, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## ఐఎన్‌టియుసి జిల్లా, నగర కమిటీలు

అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అనుబంధ విభాగమైన ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్(ఐఎన్‌టియుసి) జాతీయ అధ్యక్షుడు డా॥ జి.సంజీవరెడ్డి ఐఎన్‌టియుసి జిల్లా, నగర కమిటీని నియమిస్తూ ఇటీవల ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరుజిల్లా కమిటీ అధ్యక్షుడుగా ఎదుగుల విజయకుమార్, వర్కింగ్ అధ్యక్షుడుగా సయ్యద్ బాషా, చీఫ్ ఉపాధ్యక్షులుగా డి.శ్రీనివాసులురెడ్డి, డా॥ సుధాకర్, ఉపాధ్యక్షులుగా మల్లిరాజు, పి.మహేష్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, ప్రధానకార్యదర్శిగా జి.శివాచారి, జాయింట్ సెక్రటరీగా ఇ.విల్సన్, పి.జిలాని, బుజ్జయ్య, కె.కోటేశ్వరరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా సి.శంకరయ్య, షేక్ జబ్బార్, బి.దిలీప్‌సింగ్, జె.రమణయ్య, బి.రాజుగోపాల్, ఎమ్.కమల్‌కుమార్ ఎంపికయ్యారు. నెల్లూరునగర కమిటీ అధ్యక్షులుగా కొడమల ఆశీర్వాదం, ఉపాధ్యక్షులుగా జి.బ్రహ్మయ్య, ప్రధానకార్యదర్శిగా బి.శ్రీనివాసులుయాదవ్, జాయింట్ కార్యదర్శులుగా ఎమ్.మస్తానయ్య, బి.శ్రీనివాసులు ఎంపికైనట్లు స్టేట్ జనరల్ సెక్రటరి ఆర్.సాయిబాబా ఒక ప్రకటనలో పేర్కొన్నారు.




## ఆర్థిక నేరగాళ్లెవరు?

రాజ్యాంగ స్ఫూర్తికి, నైతిక విలువలకు సమాధి కడుతూ చంద్రబాబు నలుగురు వైసిపి ఎమ్మెల్యేలకు మంత్రిపదవులిచ్చారు. ప్రతిపక్షనేత వై.యస్.జగన్మోహన్‌రెడ్డి దీనిని ఢిల్లీలో అన్ని పార్టీ కార్యాలయాలు తిరిగి చంద్రబాబు దిగజారుడు రాజకీయాన్ని బుర్రకథలుగా వినిపించాడు. చంద్రబాబు గురించి ఇప్పుడు ఢిల్లీలో అందరికీ తెలిసిపోయింది. ఢిల్లీలో తన పరువు తీసాడనే కోపంతో ఆర్థిక నేరగాడు జగన్‌కు ఇంటర్వ్యూలు ఎలా ఇస్తారని చంద్రబాబు ఢిల్లీ నాయకులపై రుసరుసలాడుతున్నాడు. జగన్‌పై వున్నవి అభియోగాలు మాత్రమే. ఏ కోర్టు కూడా ఆయనను ఆర్థిక నేరగాడిగా తీర్పివ్వలేదు. బ్యాంకుల్లో వేలకోట్లు అప్పులున్న సుజనాచౌదరి, రాయపాటి సాంబశివరావు, వాకాటి నారాయణరెడ్డి లాంటి ఆర్థిక నేరగాళ్లను తన పార్టీలో పెట్టుకుని, స్వయంగా తానే ఓటు–నోటు కేసులో నిందితుడిగా వుండి కూడా చంద్రబాబు ఇంకొకరిపై విమర్శలు చేయడం విడ్డూరంగా వుంది. **– ఎస్.కె.నాగూర్‌వలి, నెల్లూరు.**

## అజ్ఞాతవాసం ముగిసింది

సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి 15ఏళ్ల రాజకీయ అజ్ఞాతవాసం ముగిసింది. జిల్లాలో తెలుగుదేశం కార్యకర్తల కోరిక తీరింది. మంత్రయ్యాడు. కష్టనష్టాలలో తెలుగుదేశంపార్టీని వీడలేదు. పార్టీని నమ్ముకుని జగన్ వంటి వారిని ఎదుర్కొన్నాడు. తెలుగుదేశం పార్టీ అధినేత మీద ఈగ వాలనీయలేదు. పిట్టకొంచెమైనా కూత ఘనమన్నట్లు ప్రతిపక్షంపై పదునైన విమర్శలు ఎక్కుపెట్టాడు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో సోమిరెడ్డి నాయకత్వం ఎంతైనా అవసరం. సరైన సమయంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. అలీపురంలో ఆయనకు కలిసొచ్చిన ఇంటి (ఈశాన్య పోటు)లోనే వుంటూ తనకు అప్పగించిన వ్యవసాయశాఖను సమర్థవంతంగా నిర్వర్తించాలి. **– వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

## చంద్రబాబు ఇల్లు కనిపించలేదా?

2014 ఎన్నికలకు ముందు లోటస్‌పాండ్‌లోని జగన్మోహన్‌రెడ్డి ఇంటిని పచ్చ మీడియా పదేపదే చూపించింది. మరి అదే మీడియాకు నిన్నటి హైదరాబాద్‌లోని చంద్రబాబు ఇంద్రభవనం కనిపించినట్లు లేదు. ఈ ఇంటిలో వున్న విలాసవంతమైన వస్తువులు కనిపించినట్లు లేదు. ప్రపంచంలోనే అత్యంత చెత్తమీడియా ఇండియాలో వుంటే ఇండియాలోకల్లా అత్యంత చెత్తమీడియా మన ఆంధ్రప్రదేశ్‌లోనే వుంది. **సి.రాంబాబు, నెల్లూరు.**

# జననేతకు బ్రహ్మరథం



రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించి తొలిసారిగా ఈ నెల 7వ తేదీన నెల్లూరుకు వచ్చిన సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ప్రజలు, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలు, అభిమానులు బ్రహ్మరథం పట్టారు. అడుగడుగునా భారీఎత్తున స్వాగతఫ్లెక్సీలను ఏర్పాటు చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. సోమిరెడ్డి స్వాగత ఫ్లెక్సీ కటౌట్‌లతో నగరం పసుపుమయం అయ్యింది. విజయవాడ నుండి రోడ్డు మార్గాన నెల్లూరు చేరుకున్న సోమిరెడ్డికి జాతీయ రహదారిపై చింతారెడ్డిపాలెం జంక్షన్ వద్ద అభిమానులు ఘనస్వాగతం పలికారు. అక్కడనుండి విఆర్‌సి సెంటర్‌కు చేరుకున్న ఆయనను లారీపై ఎక్కించారు. ఆయనతో పాటు మంత్రి పి.నారాయణ, తెలుగుదేశంపార్టీ జిల్లా అధ్యక్షులు బీద రవిచంద్ర, ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు బొల్లినేని రామారావు, కురుగొండ్ల రామకృష్ణ, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఇతర జిల్లా నాయకులు ఊరేగింపులో పాల్గొన్నారు. అక్కడనుండి ట్రంకురోడ్డు, గాంధీబొమ్మ, ఏ.సి సెంటర్‌ల మీదుగా భారీ ప్రదర్శన జరిగింది. బాణాసంచా మోతలతో ప్రదర్శన దద్దరిల్లింది. సర్వేపల్లి నియోజకవర్గం నుండే కాకుండా జిల్లాలోని అన్ని ప్రాంతాల నుండి తెలుగుదేశం అభిమానులు ఎవరూ వాహనాలు పెట్టకుండానే తమంతటతాము స్వచ్ఛంధంగా కదిలివచ్చి సోమిరెడ్డి అభినందన సభలో పాల్గొన్నారు. నర్తకి సెంటర్‌లో ఏర్పాటుచేసిన సోమిరెడ్డి అభినందనసభకు వేలసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు తరలివచ్చారు.




## నారాయణ ముచ్చట కూడా తీరింది?

కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డప్పుడు మంత్రులైన వాళ్ళు తన జిల్లాలకు మొదటిసారి వెళ్లినప్పుడు భారీ ఊరేగింపులు, అభినందన సభలు కామన్‌గా వుంటాయి. రాజకీయాల్లో వుండే జోష్ అదే! కాని పాపం నారాయణ ఆ సరదాకు దూరంగా వుండిపోయారు. 2014లో తెలుగుదేశం అధికారంలోకి వచ్చాక చంద్రబాబు కొలువులో ఆయన మున్సిపల్ మంత్రి కావడం తెలిసిందే! అయితే మంత్రిగా ఆయన తొలిసారి జిల్లాకు ఎప్పుడొచ్చాడో ఎప్పుడుపోయాడో కూడా తెలియకుండా జరిగిపోయింది. ఆయన ఎక్కువుగా నెల్లూరుకు అర్ధరాత్రిళ్ళు వస్తుండడం వల్ల కార్యకర్తలు నిద్రమేల్కొని ఆయనకు ఊరేగింపు నిర్వహించలేకపోయారు. మంత్రయిన మూడేళ్ల తర్వాత సోమిరెడ్డి పుణ్యాన ఆయనకు ఆ సరదా తీరింది. సోమిరెడ్డితో కలిసి ఆయన కూడా ఊరేగింపులో పాల్గొని దండలు వేయించుకుని, శాలువాలు కప్పించుకుని మంత్రిపదవిలో వున్న మజాను ఆస్వాదించారు.



దాదాపు రెండు దశాబ్దాల పాటు జిల్లా రాజకీయాలలో ఒక వెలుగు వెలిగి, నేదురుమల్లి వంటి రాజకీయ యోధులను కూడా దెబ్బతీసిన ఆనం సోదరులకు ప్రస్తుతం రాజకీయాలలో గడ్డు పరిస్థితి కొనసాగుతోంది.

# ఆనం ఆశలపై నీళ్ళు!

వై.యస్.రాజశేఖరరెడ్డి ఉన్నంత కాలం జిల్లాలో ఆనం వారి హవా కొనసాగింది. వై.యస్. మరణం తర్వాత రోశయ్య, కిరణ్‌ల హయాంలోనూ వారి పెత్తనం ఇంకా ఎక్కువుగానే కొనసాగినా పరోక్షంగా మాత్రం వై.యస్. మరణం వారి రాజకీయ జీవితచరిత్రను అనుకోని మలుపు తిప్పింది. వై.యస్. మరణం తర్వాతే కాంగ్రెస్‌ను వదిలి జగన్ సొంత పార్టీ పెట్టడం, ఆ కసితో సోనియాగాంధీ ఆంధ్రప్రదేశ్‌ను విభజించాలనుకోవడం, విభజన తర్వాత ఏపిలో కాంగ్రెస్ మట్టి గొట్టుకుపోవడం, కాంగ్రెస్‌తో పాటు ఆనం సోదరులు కూడా రాజకీయంగా వెలుగు కోల్పోవడం ఒకదాని వెంట ఒకటి జరిగాయి.


రాజకీయంగా మనుగడ సాగించాలంటే టీడీపీలోకో వైసీపీలోకో వెళ్లాలి. కాంగ్రెస్‌లోనే వుంటే ఆనం సోదరులు సి.వి.శేషారెడ్డి, చెంచలబాబుయాదవ్‌ల మాదిరిగా పార్టీ కార్యక్రమాలలో జెండాలు మోసుకోవడం, ఇందిరా వర్ధంతి, సోనియా బర్త్‌డేలు చేసుకుంటుండడం తప్ప ఇక చేసేదేమీ వుండదు. కాంగ్రెస్‌లో వున్నప్పుడు జగన్‌ను అనరాని మాటలన్నారు కాబట్టి ఆనం సోదరులు ఆ పార్టీలోకి పోలేక తెలుగుదేశంలో చేరిపోయారు.

అయితే కాంగ్రెస్ సంస్కృతికి అలవాటు పడ్డ ఆనం సోదరులు తెలుగుదేశంలో పూర్తి స్థాయిలో ఇమడలేకపోతున్నారు.

## ఆత్మకూరు సీటు తప్పితే ఇంకేమీ లేనట్లే!

ఒకప్పుడు వీళ్ల ముందు చేతులు కట్టుకుని తిరిగినవాళ్లు ఇప్పుడు తెలుగుదేశంలోకి వచ్చేసరికి పార్టీలో (మిగతా 11వ పేజీలో)



# దొంగలు బాబోయ్... దొంగలు



**మాగుంట లే అవుట్‌లో భయం భయం**

**నెల్లూరు నగరంలో జూబ్లీహిల్స్‌లాగా పేరుబడ్డ మాగుంట లే అవుట్‌లో ఇప్పుడు దొంగల భయం వెంటాడుతోంది. రాత్రిళ్లు ప్రశాంతంగా కునుకుతీసే పరిస్థితి లేకుండా పోయింది.**

ఇటీవల ఈ ప్రాంతంలో చోటుచేసుకున్న వరుస సంఘటనలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత పదిరోజుల్లోనే లెక్చరర్స్ కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో అర్ధరాత్రి దాటాక గుర్తు తెలియని దుండగులు ప్రవేశించేందుకు ప్రయత్నించారు. అక్కడేవున్న సెక్యూరిటీ గార్డ్ వారిని అడ్డగించడంతో దుండగులు అతని మీద దాడిచేసి పారిపోయారు. ఆ పక్కరోజే ఇదే కాలనీలో నివాసముంటున్న ఓ రిటైర్డ్ లెక్చరర్ ఇంటిలోకి దుండగులు ప్రవేశించారు. అయితే అలికిడికి ఆ ఇంటిలోని వారు లేచి అరవడంతో దుండగులు పరారయ్యారు. ఇవి జరిగిన పక్కరోజే మాగుంట లేఅవుట్ ఒకటి, రెండో వీధిల్లో వుంటున్న ఓ రెండిళ్లలో దోపిడీలకు దుండగులు స్కెచ్ వేశారు. సురేంద్రరెడ్డి అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించిన ఆగంతకులు ముందుగా అక్కడున్న సి.సి. కెమెరాలను గుడ్డలతో కప్పారు. వాచ్‌మెన్ రూమ్‌కు బయట గడిపెట్టి ఆ ఇంట్లోకి జొరబడాలని చూసారు. అయితే ఆ ప్రయత్నం విఫలం కావడంతో, ఆ ఇంటి వెనుకే వున్న బాలచంద్రారెడ్డి అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించారు. కత్తితో కిటికీకున్న మెష్‌ను కత్తిరించి లోపల తగిలించి వున్న తాళాలను తీసుకున్నారు. వెనుకవైపు నుండి తలుపులు తెరచి లోపలకు ప్రవేశించారు. బీరువాను తెరచి నగదు, నగలు దొరక్కపోవడంతో విలువైన పట్టుచీరలను మూటగట్టారు. ఈ సమయంలో బాలచంద్రారెడ్డి భార్యకు మెళుకువ రావడం, ఇంట్లో ఎవరో దూరినట్లు ఆమె గుర్తించి అలికిడి చేయడంతో ఆగంతకులు పారిపోయారు.

మాగుంట లే అవుట్‌లో గతంలోనూ ఇంటి దోపిడీలు, చైన్‌స్నాచింగ్‌లు ఎక్కువగానే జరిగి వున్నాయి. మాగుంట లే అవుట్ అండర్ బ్రిడ్జి వద్ద పోలీస్ ఔట్‌పోస్ట్ పెట్టినా పెద్దగా ఉపయోగం లేదు. ఇందులో పోలీసులే ఉండడం లేదు. రాత్రి గస్తీలు అంతంత మాత్రంగా వుంటున్నాయి. దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేసినా పోలీసుల నుండి వెంటనే స్పందన రావడం లేదు. పోలీసుల నిఘా కొరవడడం వల్లే దొంగలు యధేచ్ఛగా రెచ్చిపోతున్నారు. మాగుంట లే అవుట్‌లో రాత్రి గస్తీలు ముమ్మరం చేస్తేనేగాని ఈ ప్రాంత ప్రజలు ప్రశాంతంగా ఉండలేరు.

## నెల్లూరు కబుర్లు

# వెక్కిరిస్తున్న ఏటిఎంలు

### నోట్ల రద్దు నాటి పరిస్థితులు




నోట్ల రద్దు కష్టాలు తీరినట్లే తీరి మళ్ళీ మొదటికొచ్చాయి. నగదు కొరతతో నెల్లూరులోని దాదాపు ఎక్కువశాతం ఏటిఎంల ముందు 'నోక్యాష్' బోర్డులు దర్శనమిస్తున్నాయి. ఏదన్నా ఏటిఎంలో డబ్బు పెట్టినా గంటలో ఊడ్చేస్తున్నారు. డబ్బులు వస్తున్న ఏటిఎంల కోసం ఖాతాదారులు నగరమంతా గాలిస్తూ తిరుగుతున్నారు. డబ్బులుండే ఏటిఎంల ముందు 'క్యూ'లు చాంతాడంత వుంటున్నాయి. ప్రస్తుతం ఏటిఎంల వద్ద వేలాడదీసిన 'నోక్యాష్' బోర్డులు చూస్తుంటే నవంబర్, డిసెంబర్ నెలల్లో వున్న పరిస్థితే పునరావృతమైనట్లుగా వుంది. నగదు కష్టాలు ఏ మాత్రం తీరలేదు.

# సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఎక్కిన మేయర్



నెల్లూరు మేయర్ షేక్ అబ్దుల్ అజీజ్ 10వ తేదీ నగరంలోని సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంకులోని సంపు, పంపు, ఫిల్టర్ హౌస్‌ల పనితీరు చూసారు. ముందుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నగరంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చేసేందుకు తాగునీటి పథకాలను మరింత పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. నగరంలో ప్రజలకు రెండుపూటలా తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుతో పాటు పెన్నానదిలోని బావుల ద్వారా నగరంలోని అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేస్తామన్నారు. నగరంలో నీటి ఎద్దడి నివారణకు మంత్రి నారాయణ 4కోట్ల రూపాయలు మంజూరు చేసారని ఆయన పేర్కొన్నారు. నగరంలో ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే ప్రజలు టోల్‌ఫ్రీ నెంబర్ 9908092220కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు.

### డిఆర్‌ఓ ఛాంబర్‌లో

# షార్ట్‌సర్క్యూట్

ఈనెల 11వతేదీ నెల్లూరు కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి ఛాంబర్‌లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఏ.సి పూర్తిగా కాలిపోయి మంటలు వ్యాపించాయి. మంటలు సీలింగ్‌కు కూడా అంటుకోవడంతో దట్టంగా పొగ కమ్మేసింది. సిబ్బంది అప్రమత్తమై ఫైర్ స్టేషన్‌కు ఫోన్ చేశారు. వెంటనే అగ్ని మాపక సిబ్బంది వచ్చి మంటలు ఆర్పడంతో రికార్డులు ఏవీ తగలబడలేదు.

# ఢిల్లీ జేసీపితో కిషోర్



నెల్లూరులోని డాక్టర్ కిషోర్స్ రత్నం విద్యాసంస్థల అధినేత డాక్టర్ కె.కృష్ణకిషోర్ ఈ నెల 8వ తేదీన ఢిల్లీలో నార్తన్‌ఢిల్లీ జాయింట్ పోలీస్ కమిషనర్ ఆఫ్ పోలీస్ రాజేష్‌ఖురానాను మర్యాద పూర్వకంగా కలిసారు. పాఠశాలలో విద్యార్థుల భద్రతకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయనతో చర్చించారు.

ఓసారి నెల్లూరుకు వచ్చిపోవాలని తమ విద్యా సంస్థల తరపున ఆయన ఖురానాను ఆహ్వానించారు.

### ఊరందూరుకు

# 'ఉపాధి' పదవి



తెలుగుదేశం పార్టీ క్రిస్టియన్ సెల్ జిల్లా అధ్యక్షుడు ఊరందూరు సురేంద్ర బాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్‌గా నియమించారు. ముఖ్యమంత్రి ఛైర్మెన్‌గా వ్యవహరించే ఈ కౌన్సిల్‌లో 15మంది సభ్యులుంటారు. ఐ.టి, పంచాయితీరాజ్ మంత్రి నారా లోకేష్ కూడా ఇందులో ఒక సభ్యుడు కావడం గమనార్హం.

# రిచ్‌లో పురిటిబిడ్డకు అరుదైన ఆపరేషన్




నెల్లూరు పొగతోటలోని రిచ్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిలో సోమవారం అరుదైన ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా రిచ్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఛైర్మెన్ డా॥ టి.రవికుమార్ మాట్లాడుతూ నెల్లూరుజిల్లా జలదంకి గ్రామానికి చెందిన ప్రసన్న, రవీంద్ర దంపతులకు మొదటి కాన్పులో పుట్టిన మగబిడ్డ, పుట్టగానే శరీరం పూర్తి నీలిరంగుతో, ఆయాసంతో ప్రమాదకర పరిస్థితిలో వుండగా, డాక్టర్ విజయలక్ష్మి తమ హాస్పిటల్‌కి పంపడం జరిగిందన్నారు. ఈ క్రమంలో తన ఆధ్వర్యంలో డా॥ శివకుమార్, డాక్టర్ సురేష్‌బాబు వైద్యబృందం అత్యంత ఖరీదైన శస్త్రచికిత్సను ఎన్‌టిఆర్ వైద్యసేవ పథకం ద్వారా పూర్తి ఉచితంగా చేసి బిడ్డ ప్రాణాలను కాపాడామన్నారు. ఇటువంటి సమస్య రెండువేల మందిలో ఒకరికి వస్తుందన్నారు. అత్యాధునిక న్యూబోర్న్ స్క్రీనింగ్ ద్వారా పురిటిపిల్లలకు ఆపరేషన్ చేయడానికి ప్రత్యేకమైన మాడ్యులర్ ఆపరేషన్ థియేటర్ తమ హాస్పిటల్‌లో ఉన్నందున బిడ్డ సమస్యను గుర్తించి రక్షించామన్నారు. శస్త్ర చికిత్స అనంతరం బిడ్డ తల్లిదండ్రులు ఆనందంతో కృతజ్ఞతలు తెలిపారన్నారు.

# ఆ లిఫ్టులు డేంజర్



నెల్లూరు రైల్వేస్టేషన్‌లో వున్న లిఫ్టులు ప్రయాణీకుల పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. మొన్న ఆదివారం రైల్వేస్టేషన్‌లోని లిఫ్ట్‌లో 20మంది దాకా ఎక్కారు. ఓవర్‌లోడ్ కారణంగా క్షణాలలో దిగాల్సిన లిఫ్ట్ 15నిముషాలకు దిగింది. కిందకు దిగినా కూడా తలుపులు తెరచుకోకపోవడంతో గాలి ఆడక అందులోని ప్రయాణీకులు నరకయాతన అనుభవించారు. లిఫ్ట్‌లో ఇరుక్కున్న వాళ్ళు సెల్‌ఫోన్ ద్వారా రైల్వేస్టేషన్ సిబ్బందికి సమాచారమందించడంతో వాళ్లొచ్చి లిఫ్ట్ తలుపులు తెరచి ప్రయాణీకులను బయటకు రప్పించారు. దాదాపు అరగంటపాటు ప్రయాణీకులు టెన్షన్‌కు గురయ్యారు. గతంలోనూ సింగరాయకొండకు చెందిన ప్రయాణీకులు ఇక్కడే లిఫ్ట్‌లో ఇరుక్కుని దాదాపు గంట సేపు మృత్యువుతో పోరాడారు. ప్రయాణీకులు నెల్లూరు రైల్వేస్టేషన్‌లో లిఫ్టుల పట్ల జాగ్రత్తగా ఉంటే మంచిది.

# నారాయణ క్యాంపు కార్యాలయం

రాష్ట్ర మున్సిపల్ శాఖామంత్రి పొంగూరు నారాయణ తన నూతన క్యాంపు కార్యాలయాన్ని నెల్లూరు మాగుంట లేఅవుట్ గోమతినగర్‌లో ఏర్పాటు చేశారు. ఈనెల 8వతేదీ రాత్రి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి కార్యాలయాన్ని ప్రారంభించి తన సీటులో ఆసీనులయ్యారు. అధికారులు, నాయకులు, కార్యకర్తలతో మాట్లాడేందుకు, సమీక్షలు నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో తాళ్ళపాక అనూరాధ, మేయర్ అబ్దుల్ అజీజ్, కొండ్రెడ్డి రంగారెడ్డి, చిరంజీవి నాయుడు, వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మంత్రి ఓఎస్‌డి పెంచలరెడ్డి పాల్గొన్నారు.

# నెల్లూరు గుళ్ళలో మెగాస్టార్ మాతృమూర్తి

నెల్లూరు రంగనాయకులపేటలోని శ్రీ తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానాన్ని ప్రముఖ సినీనటుడు చిరంజీవి మాతృమూర్తి అంజనాదేవి ఈ నెల 8వ తేదీ శనివారం రాత్రి సందర్శించారు. నెల్లూరులో శనివారం రాత్రి జరిగిన బంధువుల వివాహానికి హాజరయ్యేందుకు విచ్చేసిన ఆమె నెల్లూరు నగరంలోని శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానం, శ్రీ మూలస్థానేశ్వరస్వామి దేవస్థానం తదితర ఆలయాలను దర్శించుకున్నారు. రంగనాథ స్వామి దేవస్థానంలో స్వామివారిని, అమ్మవార్లను దర్శించి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. దేవస్థానం ధర్మకర్తల మండలి ఛైర్మెన్ మంచికంటి సుధాకరరావు, ఆలయ ప్రధానార్చకులు కిడాంబి జగన్నాధాచార్యులు ఆమెకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా సంవత్సరాల తర్వాత నెల్లూరుకు వచ్చానన్నారు. దేవస్థానాలను దర్శించుకోవాలనే కోర్కె ఈరోజు నెరవేరిందన్నారు. ఆమె వెంట రాష్ట్ర చిరంజీవి యువత కార్యదర్శి డి.వి.సుజయ్‌బాబు ఉన్నారు.



# విపిఆర్ విద్యకు విశేష స్పందన

2017-18 విద్యాసంవత్సరంలో విపిఆర్ విద్య పాఠశాలలో 6వ తరగతి ప్రవేశానికి గాను నిర్వహించిన ఉచిత విద్య ప్రవేశపరీక్షకు విద్యార్థుల నుండి విశేష స్పందన లభించింది. ఈ నెల 9వ తేదీన 6వ తరగతిలో 30సీట్ల ప్రవేశానికిగాను నిర్వహించిన ప్రవేశ పరీక్షకు దాదాపు 200మంది నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. విపిఆర్ ఫౌండేషన్ సిఇఓ ఆచార్య వి.నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ వి.టి.శ్రీనివాసులు పర్యవేక్షణలో ఈ ప్రవేశ పరీక్ష జరిగింది. విపిఆర్ ఫౌండేషన్ అధినేతలు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, శ్రీమతి ప్రశాంతిరెడ్డిల సహకారంతో 2016-17 విద్యా సంవత్సరం నుండి విపిఆర్ విద్య పాఠశాలలో తరగతులను ప్రారంభించడం తెలిసిందే! ఇప్పటికే 90మంది నిరుపేద విద్యార్థులు ఈ పాఠశాలలో ఉచిత విద్యను అభ్యసిస్తున్నారు.

### నేషనల్ హైవే నిర్వాసితులకు

# పునరావాసం కల్పించాలి

### నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్



నేషనల్ హైవే నిర్వాసితులకు పునరావాసం కల్పించాలని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. నెల్లూరు 53వ డివిజన్ పరిధిలోని సాలుచింతల, షుగర్‌ఫ్యాక్టరీ ప్రాంతాల్లో సోమవారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముంబై నేషనల్ హైవేను వెడల్పు చేయడంలో భాగంగా తమ ఇళ్లను తొలగిస్తారని ఆ ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. ప్రజలకు పునరావాసం చూపిన తర్వాతే ఇళ్లను తొలగించాలని నేషనల్ హైవే అధికారులకు, రెవెన్యూ అధికారులకు సూచించామన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆ ఇళ్లను తొలగిస్తే వారికి ప్రత్యామ్నాయంగా సమీపంలో వున్న ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లను నిర్మించుకునేందుకు స్థలాలు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ దేవరకొండ అశోక్, జమీర్, నాగరాజు, జస్సీ, బ్రహ్మారెడ్డి, సుభాషిణి, సుధ పాల్గొన్నారు.

# శ్రీసిటీలో చైనా వ్యాపార ప్రతినిధుల బృందం



చైనాలోని జియాన్సు రాష్ట్రానికి చెందిన ఐదుగురు సభ్యుల వ్యాపార ప్రతినిధుల బృందం మంగళవారం శ్రీసిటీలో పర్యటించింది. వారంతా ఎలక్ట్రానిక్స్, మౌళిక వసతులు, గృహనిర్మాణం, నిర్మాణ వస్తువుల తయారీ వంటి వ్యాపార రంగాలకు చెందిన వారు. శ్రీసిటీ యం.డి రవీంద్ర సన్నారెడ్డితో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై చర్చించారు. తరువాత, హంటర్ డగ్లస్మరియూ చుంక్జింగ్ కంపెనీలను సందర్శించారు. నవ్యాంధ్రలో వ్యాపారపెట్టుబడులకై రాష్ట్రంలో పర్యటించనున్న ఈ బృందసభ్యులు, తమ తొలి మజిలీగా శ్రీసిటీని ఎన్నుకున్నారు. చెన్నైలోని స్పార్టెక్ సంస్థ వీరి పర్యటనను ఏర్పాటు చేసింది.



### • మైక్ విరిస్తేనే వీరుడు

# జడ్పీ మీటింగ్‌లో వాకాటి వీరంగం



**అసెంబ్లీ సమావేశాలలో మైకులు విరిచినవాళ్ళను, బెంచీల మీదకెక్కి దరువు వేసినవాళ్లను, కాగితాలను చించి స్పీకర్ ముఖాన కొట్టిన వాళ్లను మీడియా బాగా ఫోకస్ చేస్తుంటుంది. ఇలా మైకులు విరిచేవాళ్లను, విసిరేవాళ్లను హీరోలుగా చిత్రిస్తుంటుంది. ఈ ఫోబియా నాయకులందరికీ పాకింది. మైకులు విరిచి విసిరి కొట్టకపోతే మనల్ని చేతకాని దద్దమ్మలు అనుకుంటారేమోనన్న భావన ఇటీవల నాయకులలోనూ కనపడుతోంది. ఎప్పుడు మైకు విరిచే అవకాశం వచ్చినా నాయకులు దానిని వదులుకోవడం లేదు. ఇలాంటి అవకాశమే మొన్న జడ్పీ సమావేశంలో ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డికొచ్చింది. తన అవకాశాన్ని ఆయన సద్వినియోగం చేసుకుని మైకులు విరవడంలో వాకాటికి ఎవరూ పోటీలేరని, ఆయనే మేటి అని, ఆయనకెవరూ రారు సాటి అని నిరూపించాడు. తన ప్రతిభా సామర్థ్యాన్ని చాటుకున్నాడు.**

ఈ నెల 8వ తేదీ నెల్లూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి అధ్యక్షతన జరిగిన జడ్పీ సర్వసభ్య సమావేశం నాయకుల అరుపులు, కేకలతో దద్దరిల్లింది. మంత్రిగా బాధ్యతలు చేపట్టాక సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి తొలి జడ్పీ సమావేశమిది. ఆయనతో పాటు జిల్లా ఇన్‌ఛార్జ్‌మంత్రి శిద్ధా రాఘవరావు, మంత్రి పి.నారాయణ, ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్రహ్మణ్యం, యండపల్లి శ్రీనివాసులురెడ్డి, వాకాటి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, కురుగొండ్ల రామకృష్ణ, బొల్లినేని రామారావులు పాల్గొన్నారు. జిల్లాలో కరువు, తాగునీటి సమస్యలపై నాయకులు ఎక్కువగా చర్చించారు. అలాగే ఇరిగేషన్, వ్యవసాయం, డ్వామా, పంచాయితీరాజ్, ఆర్ అండ్ బి శాఖల పనితీరుపై కూడా సమీక్షించారు. అయితే మిగతా సభ్యులకు అవకాశం లేకుండా వాకాటి ఎక్కువ సమయం మాట్లాడుతుండడంతో అధ్యక్ష స్థానంలో వున్న బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆయన మైక్‌ను కట్ చేశారు. దీంతో వాకాటికి చిర్రెత్తుకొచ్చి మైక్‌ను విరిసి బెంచికేసి కొట్టాడు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది. అలాగే ఆసుపత్రుల నిధుల విషయంలో ఎమ్మెల్యేలు కిలివేటి సంజీవయ్య, పోలంరెడ్డి మధ్య, పదో తరగతి ప్రశ్నాపత్రాల లీకేజీ వ్యవహారంలో కాకాణి గోవర్ధన్‌రెడ్డి, వాకాటిల మధ్య రచ్చ నడిచింది. మొత్తానికి ఈ సమావేశంలో సమస్యలపై చర్చకంటే వాకాటి మైక్ రచ్చే హైలెట్ అయ్యింది.

# ఎమ్మెస్సార్ సేవా సమితి మరో చలివేంద్రం



నానాటికి మండుతున్న ఎండలను దృష్టిలో పెట్టుకుని నెల్లూరు నగరంలో పలు చోట్ల చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్న మాగుంట శరత్‌చంద్రారెడ్డి యువజన సేవాసమితి ఆధ్వర్యంలో ఇటీవల కొండాయపాళెంగేటు, ఉమ్మారెడ్డి గుంట ప్రాంతంలో మజ్జిగ మరియు మినరల్‌వాటర్ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఐదో నగర సిఐ జి.మంగారావు ముఖ్యఅతిథిగా విచ్చేసి ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు పి.వి.రాజేష్, శామ్యూల్, భాను, గోవర్ధన్, రాజు తదితరులు పాల్గొన్నారు.


తృతీయ వర్ధంతి



మానవత్వానికి ప్రతిరూపంలా నిలిచారు. దాతృత్వంతో అందరి మనసులు గెలిచారు.
శ్రమించే తత్వానికి ప్రతిబింబం మీరు... మంచిని పంచే వ్యక్తిత్వానికి పెట్టింది మీ పేరు.
మా ఉన్నతికి బాటలు వేసి. మా బంగారు భవిష్యత్‌కు మార్గదర్శకులుగా నిలిచిన
మా ఇంటి దైవం

కీ॥శే॥ చెరుకుపల్లి పిచ్చిరెడ్డి గారు

అధినేత: సిపిఆర్ కళ్యాణ మండపం, శివప్రియ లాడ్జి

పరమపదించి 18.04.2017 మంగళవారం నాటికి మూడేళ్ళు గడుస్తాయి.

వారి దివ్యస్మృతికి మా నివాళులు.

భార్య: సుబ్బరత్నమ్మ

కుమారుడు - కోడలు: చెరుకుపల్లి పద్మనారాయణరెడ్డి - సుమతి

మనుమలు: హరీశ్వర్‌రెడ్డి, భవనేశ్వర్‌రెడ్డి

మరియు బంధుమిత్రులు

# శ్రీ వివేకానంద హైస్కూల్ 40వ వార్షికోత్సవం




గూడూరు రెండోపట్టణ పరిధిలోని శ్రీ వివేకానంద హైస్కూల్ రూబీజూబ్లీ 40వ వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా సినీనటుడు చంద్రమోహన్ విచ్చేసి, బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను మంచి పౌరులుగా తయారు చేయడంలో ఉపాధ్యాయుల కృషితో పాటు తల్లిదండ్రుల బాధ్యత కూడా ఉండాలన్నారు. స్టూడెంట్ లైఫ్ ఎంతో విలువైందని, 40సంవత్సరాల పాటు అంకితభావంతో విద్యార్థులను తీర్చిదిద్దుతున్న వివేకానంద పాఠశాల యాజమాన్యాన్ని అభినందిస్తున్నానన్నారు. తనకు ఇద్దరు కుమార్తెలని, వారిని సినీ రంగం వైపు కాకుండా కేవలం చదువుకే ప్రాధాన్యతనిచ్చానని, డాక్టర్లుగా గోల్డ్‌మెడల్స్ సాధించారన్నారు. 50వ వార్షికోత్సవానికి కూడా తానే ముఖ్యఅతిథిగా రావాలని ఆకాంక్షించారు.

వివిధ రంగాల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా గూడూరు 'లాయర్' ప్రతినిధి ఆనిమెళ్ళ శివకుమార్‌ను చంద్రమోహన్ మెమెంటోతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ చంద్రమోహన్, వంశీకృష్ణ, తదితర కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇటీవల వాకాడు మండలం తూపిలిపాళెం ఎన్ఐఓటి ఆధ్వర్యంలో ఫిన్-ఫిష్ హేచరి, సముద్రపు నీటి శుద్ధి, పలు ప్రాజెక్టులకు శంకుస్థాపన చేసిన సభలో మాట్లాడుతున్న వ్యవసాయశాఖామంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, పక్కన కేంద్రమంత్రి సుజనాచౌదరి, మంత్రులు, ఎమ్మెల్యేలు నాయకులు తదితరులు.

### లయన్స్‌క్లబ్
## జిల్లా గవర్నర్ పర్యటన

గూడూరు పట్టణంలో వైజేపీ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా గవర్నర్ బాలస్వామి సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా వైజేపీ లయన్స్ అధ్యక్షుడు




చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో గవర్నర్‌ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి సేవా కార్యక్రమాల గురించి క్లబ్ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు వరిదిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి హరికృష్ణ, సుబ్రహ్మణ్యం, చంద్రశేఖర్, నగేష్, గౌతమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

### సాయికృష్ణ యాచేంద్ర
## సాహితీసేవలు అపూర్వం
### ----------- ప్రముఖ సినీకవి వెన్నెలకంటి -----------



వెంకటగిరి రాజ కుటుంబీకుడు, ప్రముఖ సాహితీవేత్త, సంగీత సాహిత్య రంగాల్లో చేస్తున్న సేవలు ఎంతైనా అపూర్వం... అభినందనీయమని ప్రముఖ సినీ కవి వెన్నెలకంటి రాజేశ్వరప్రసాద్ అన్నారు.

ఈ నెల 9వ తేది రాత్రి వెంకటగిరిలోని రోటరీక్లబ్ ఆధ్వర్యంలో సాయికృష్ణ యాచేంద్రకు ఘనంగా అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వెన్నెలకంటి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇటీవలే సాయికృష్ణ యాచేంద్ర ఎంతో విశిష్టమైన 'కళారత్న' బిరుదును అందుకోవడం విశేషమని ప్రశంసించారు. సంగీత కళాకారునిగా, సాహితీవేత్తగా సాయికృష్ణ చేస్తున్న కృషికి గుర్తింపుగా ఆయనకు రాష్ట్ర ప్రభుత్వ సత్కారం లభించడం సంతోషకరమని అన్నారు. శ్రీకృష్ణదేవరాయలు కాలంలో కళలను, కవులను ఎంతగానో పోషించేవారని, అలాంటిది నేటితరంలో వెంకటగిరి రాజవంశానికి చెందిన సాయికృష్ణ ఆధ్వర్యంలో ఎన్నో సంగీత, కళా కార్యక్రమాలు జరుగుతుండడం ఆనందకరమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ద్రవిడ విశ్వవిద్యాలయం మాజీ వైస్‌ఛాన్సలర్ రమణయ్య మాట్లాడుతూ, 'సంగీత గేయధార' అనే వినూత్న ప్రక్రియను ఆవిష్కరించిన సాయికృష్ణ యాచేంద్ర సంగీత, సాహిత్యరంగాల్లో భావి తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారని కొనియాడారు. తొలుత, సాయికృష్ణ యాచేంద్ర రచించిన, కార్వేటినగరానికి చెందిన ప్రసిద్ధ పద కవి సారంగపాణి జీవితవిశేషాలతో కూడిన గ్రంథాన్ని, సారంగపాణి గీతాల సి.డిని ఆవిష్కరించారు. వీటిని అందరికీ అందుబాటులోకి తీసుకురావడం తన అదృష్టంగా భావిస్తున్నానని ఈ సందర్భంగా సాయికృష్ణ యాచేంద్ర సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి.

ఈ కార్యక్రమంలో వెంకటగిరి, గూడూరు రోటరీక్లబ్ అధ్యక్షులు బికె ప్రసాద్, మునిరాజ, విశ్రాంత బెటాలియన్ డిఐజి నాగముని నాయక్, విశ్వోదయ విశ్రాంత ప్రిన్సిపాల్ రమణారెడ్డి, వైఎస్సార్సీపి నాయకులు జి.ఢిల్లీబాబు, నక్కా వెంకటేశ్వరరావు, లక్ష్మీప్రసన్న ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

## గూడూరు డివిజన్ వార్తలు

### రియాజ్ ఆధ్వర్యంలో
## లోకేష్‌ను కలిసిన పంచాయితీరాజ్ అధికారులు



ఏపి పంచాయితీరాజ్ డిప్లొమా ఇంజనీరింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ రియాజ్‌అహ్మద్ ఆధ్వర్యంలో ఆ సంఘం నాయకులు రాష్ట్ర పంచాయితీరాజ్ శాఖా మంత్రి నారా లోకేష్‌ను అమరావతిలో కలిసినట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయితీరాజ్ శాఖలోని పలు సమస్యలను లోకేష్‌కు విన్నవించినట్లు తెలిపారు. దీనికి మంత్రి మేనెలలో సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయడానికి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు రాంబాబు, హనుమంతరావు, శ్రీనివాసులు, కేశవులు, సోమయాజులు పాల్గొన్నారు.

## మాజీకౌన్సిలర్ సరస్వతమ్మకు ఆర్థిక సాయం



కార్యకర్తల సంక్షేమమే టిడిపి లక్ష్యమని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ తెలిపారు. ఆర్ అండ్ బి అతిథి గృహంలో సోమవారం మాజీకౌన్సిలర్ సరస్వతమ్మకు కార్యకర్తల సంక్షేమ నిధి నుండి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1995లో కౌన్సిలర్‌గా పనిచేసిన సరస్వతమ్మ ఇప్పటివరకూ పార్టీలోనే కొనసాగుతుందన్నారు. ఆమె భర్త అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో రాష్ట్ర ఐటి శాఖ మంత్రి లోకేష్‌బాబు ఆధ్వర్యంలో కార్యకర్తల సంక్షేమనిధి నుండి లక్ష రూపాయలు ఆర్థిక సాయం అందించినట్లు తెలిపారు. గూడూరు మండలాధ్యక్షుడు, ఏఎంసీ అధ్యక్షుడు బొల్లినేని కోటేశ్వరరావు, కౌన్సిలరు వాటంబేటి శివకుమార్, షేక్ రహీం, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# హత్యకేసు నిందితుల అరెస్ట్
### - డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్



నెల్లూరుజిల్లా పోలీస్ సూపరింటెండెంట్ విశాల్‌గున్నీ పర్యవేక్షణలో గూడూరు డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గూడూరు రూరల్ సిఐ పి.అక్కేశ్వర్‌రావు చిల్లకూరు ఎస్ఐ కె.అంకమ్మ, గూడూరు రూరల్ ఎస్ఐ బాబి మరియు వారి సిబ్బందితో కలిసి ఈ నెల 11వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు గూడూరు – వరగలి క్రాస్‌రోడ్డు వద్ద చిల్లకూరు మండలంలోని ఉడతావారి పార్లపల్లి గ్రామంలో జరిగిన గొడ్డటి కోటేశ్వరరావు హత్య కేసులో 7మంది ముద్దాయిలను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరుపరిచారు. డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ తన ఛాంబర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆ వివరాలు తెలిపారు. మొదటి ముద్దాయి గొడ్డటి భరత్‌కుమార్‌తో పాటు గురసాల కృష్ణయ్య, పూజారి హరిగోపాల్, రాజశేఖర్, కాటయ్య, బడతోటి గిరి, కొత్త వెంకటేష్‌ను అరెస్టు చేసినట్లు తెలిపారు. గ్రామంలో పొలం రిజిస్ట్రేషన్‌కు సంబంధించి మృతుడు కోటేశ్వరరావుకు, నిందితుడు భరత్ కుమార్‌కు మధ్య విభేదాలు వచ్చాయి. మాట్లాడుకున్న ప్రకారం మొత్తం పొలం రిజిష్టర్ చేయకపోవడమే కాక, రిజిష్టర్ చేసిన కొంత భాగం పొలంలో కూడా తనను ప్రవేశించనీయకుండా అడ్డుకుంటుండడంతో కోటేశ్వరరావుపై భరత్ కక్ష పెంచుకుని అతనిని ఎలాగైనా చంపాలనే నిర్ణయించుకున్నాడు. తన సమీప బంధువైన జి.కృష్ణయ్య సహాయంతో మిగతా 5మందిని మాట్లాడుకుని, వారితో కాంట్రాక్ట్ కుదుర్చుకుని ఇటీవల కోటేశ్వరరావు అతని ఇంటి వరండాలో నిద్రిస్తుండగా మచ్చు కత్తితో నరికి చంపారు.

నేరస్తుల ఆచూకీ కనుగొనుటలో ప్రతిభ కనపరచిన గూడూరు రూరల్ సిఐ అక్కేశ్వరరావు, చిల్లకూరు ఎస్ఐ అంకమ్మ, రూరల్ ఎస్ఐ బాబి మరియు పోలీసు సిబ్బంది ఆర్.వి.రాజు, చిరంజీవి, ఆదినారాయణ, నవీన్, సుబ్రహ్మణ్యం, దయాకర్, సుబ్బారావులను డిఎస్పీ బాదిపల్లి శ్రీనివాస్ అభినందించి రివార్డులు ఇచ్చారు.

## వృద్ధులకు సరుకుల పంపిణీ

ఈ నెల 10వ తేదీన గూడూరులోని రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రోటరీ హెల్పేజ్ కింద ఆర్డీఓ అరుణ్‌బాబు చేతుల మీదుగా వృద్ధులకు ఫలసరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ సభ్యులు చేస్తున్న ఈ కార్యక్రమాన్ని ఆర్డీఓ అభినందించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు ఎన్.గోపాలరావు, కన్వీనర్ జానకిరామిరెడ్డి, రోటరీ గవర్నర్ కె.మునిగిరీష్, దశరథరామిరెడ్డి, పి.వి.కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

ఉద్యోగ ప్రయత్నాలు వెనుకబడతాయి. ప్రలోభాలకు లొంగకుండా ఉద్యోగులు పని చేయాలి. అనుకొన్న పనులు నిదానంగా జరుగుతాయి. రావలసిన బాకీలు నిలబడిపోతాయి. కొన్ని ముఖ్యవిషయాలు ఎవరితోనూ అనవద్దు. అనుకోని ప్రయాణాలు, శుభకార్యాలలో పాల్గొనడం జరుగుతుంది. ఆర్థిక వ్యవహారాల నిర్వహణలో జాగ్రత్త పడండి.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు సామాన్యంగా సాగుతాయి. ప్రభుత్వ అనుమతులందు ఆలస్యం, కోర్టు కేసులు వాయిదా పడడం, బంధుముఖ్యులలో ఒకరికి అనారోగ్య బాధలుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. చేయదలచిన పనులందు ఆర్థిక వ్యవహారాలలో పొరపాట్లు రాకుండా చూచుకొనాలి. పనుల తీవ్రత ఇబ్బంది పెట్టక పోవచ్చు. ఇతరులను అతిగా నమ్మవద్దు.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

దూరం నుండి ఆహ్వానాలు అందుతాయి. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. సన్నిహితులే ఇబ్బందులు పెట్టే అవకాశం కలదు. కొత్త వస్తువులు ఇంటికి సమకూరుతాయి. విద్యాప్రగతి, ఆరోగ్యం బాగుంటుంది. ఆత్మీయులకు సహాయపడతారు. బంధుత్వ స్నేహాలు బలపడతాయి. వ్యాపార విస్తరణకు పెట్టుబడులకు అవకాశాలు బాగుంటాయి. నిరుద్యోగులకు అవకాశాలు వస్తాయి.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఉద్యోగులకు కార్యసామర్ధ్యంతో పాటు పని వత్తిడి ఉంటుంది. విలువైన వస్తువులను పదిలపర్చుకొనండి. పెట్టుబడులకు కొత్త అవకాశాలుంటాయి. ఆరోగ్యం ఫరవాలేదు. ఒక ముఖ్య కార్యం మీద శ్రద్ధ చూపుతారు. కోర్టు వ్యవహారాలందు అనుకూలత కలదు. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. వృత్తి వ్యాపారాలలో వ్యాప్తి బాగుండి ఆదాయం పెరుగుతుంది.



**బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు**
బాలాజీనగర్, నెల్లూరు

# రాశి - మీ వాసి

**తేది. 14.4.2017 నుండి**
**తేది. 20.4.2017 వరకు**

ఈ వారం మేషంలో రవిబుధులు, వృషభంలో కుజుడు, సింహంలో రాహువు, కన్యలో గురువు, ధనుస్సులో శని, కుంభంలో కేతువు, మీనంలో శుక్రుడు, వృశ్చిక ధనుర్మకర రాశులలో చంద్రుడు సంచరిస్తారు.

### పంచాంగము:

ఏప్రిల్ 14తేది తమిళ సంవత్సరాది, గుడ్‌ఫ్రైడే మరియు అంబేద్కర్ జయంతి

**ముహూర్తములు**

తేది 20 గురువారం పగలు 11.10 నుండి గంట 1.0లోగ కర్కాటక లగ్నమున వ్యాపార గృహారంభ ఉపనయన వివాహాదులు.

తేది 21 శుక్రవారం సూర్యోదయానికి ముందు గంట 4.0 నుండి గంట 5.30లోగా మీన లగ్నమున గృహారంభ, గృహప్రవేశ వివాహ ఉపనయనములు.

### చైత్ర బహుళపక్ష తిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 14 | శుక్ర | తదియ | సా॥ గం.3.03వ॥ |
| తేది. 15 | శని | చతుర్థి | సా॥ గం.5.06వ॥ |
| తేది. 16 | ఆది | పంచమి | రా॥ గం.7.10వ॥ |
| తేది. 17 | సోమ | షష్ఠి | రా॥ గం.9.00వ॥ |
| తేది. 18 | మంగళ | సప్తమి | రా॥ గం.10.32వ॥ |
| తేది. 19 | బుధ | అష్టమి | రా॥ గం.11.42వ॥ |
| తేది. 20 | గురు | నవమి | రా॥ గం.12.16వ॥ |

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

కొత్త వస్తువులు సమకూర్చుకుంటారు. ఉద్యోగ ప్రయత్నాల్లో అనుకూలత, బంధుమిత్ర వర్గంతో సత్సంబంధాలు నెలకొంటాయి. కొత్త పెట్టుబడులు, స్థిరాస్తుల లావాదేవీలు జరుపుతారు. కుటుంబసౌఖ్యం, ప్రముఖులతో పరిచయాలుంటాయి. వృత్తి వ్యాపారాలలో రాబడి పెరుగుట, మంచి ఆర్థికాభివృద్ధి అవకాశాలు లభించడం జరుగుతుంది. తొందరపాటు మాటలు వద్దు.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

విలువైన వస్తువులు సమకూరటం, దూర ప్రయాణాలుంటాయి. బిడ్డల వివాహ విద్యా విషయములపై శ్రద్ధ పెడతారు. అధికారులకు మంచి గుర్తింపు గౌరవాలుంటాయి. ఆరోగ్యం, విద్యా ప్రగతి బాగుండి. ఆర్థిక ఇబ్బందులు, వ్యవహారంలో ఇబ్బందులు సర్దుకుంటాయి. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగవచ్చును. భాగస్వామిక చర్చల్లో ప్రధాన పాత్ర వహిస్తారు.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

వృత్తి వ్యాపారాలు లాభదాయకంగా ఉంటాయి. వ్యవహారాలలో మీకు మంచి విలువ వుంటుంది. కొద్దిపాటి అనారోగ్య బాధలుంటాయి. ఉద్యోగులు ఇతరులతో జాగ్రత్తగా మెలగండి. వ్యాపారులకు, ఉద్యోగులకు అధికారుల వత్తిడి ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కుటుంబంలో కొంత అనుకూలత లేకున్నా సర్దుబాటు చేసికొంటారు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్యమి, ఆశ్లేష

బంధువర్గం నుండి అనారోగ్య వార్తలు వింటారు. ఒక మంచి పనికి సంసిద్ధులై కృషి చేస్తారు. కోర్టు వ్యవహారాలు వాయిదా పడతాయి. అనుకున్న పనులు నిదానంగా జరుగుతాయి. విద్యార్థులు మంచి కృషి చేస్తారు. స్థిరాస్తుల లావాదేవీలు జరుగుతాయి. కొత్త ఆర్థికావకాశాలు త్వరలో లభించగలవు. ఆరోగ్యం ఫరవాలేదు. ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలిస్తాయి.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

ఇతరుల పని మీద ప్రయాణాలుంటాయి. నిరుద్యోగులకు మంచి అవకాశాలుంటాయి. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది. కాంట్రాక్టు పనులు, గృహ నిర్మాణ పనులు నిదానంగా సాగుతాయి. అనవసర ఖర్చులు తప్పవు. ఆరోగ్యం బాగుంటుంది. ఆర్థిక లావాదేవీలు ఉత్సాహపరుస్తాయి. స్థిరాస్తుల కొనుగోలు జరుగవచ్చును. కుటుంబ సౌఖ్యం బాగుంటుంది.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

విద్యా ప్రగతి బాగుంటుంది. అనుకున్న పనులు టెన్షన్‌తో సాగుతాయి. నష్టాలను ఆటంకాలను ధైర్యంగా ఎదుర్కొంటారు. సభలు సమావేశాలలో మీదే కీలకపాత్ర వుంటుంది. ముఖ్య నోటీసులు అందుకుంటారు. ఆర్థిక పరిస్థితి క్రమంగా బాగుంటుంది. ఖర్చులు అదుపు చేయాలి. బంధువర్గంతో సంబంధాలు బలపడగలవు. వ్యాపార వృత్తి జీవనాలు లాభసాటిగా జరుగుతాయి.

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

విద్యార్థులు చదువుపై బాగా దృష్టి పెట్టాలి. బిడ్డల విద్యా ఉద్యోగ శుభకార్య విషయాలు ఆందోళన కలిగిస్తాయి. అనుకున్న పనులు జరుపుకొనడానికి శ్రమపడాల్సి వస్తుంది. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. ఉద్యోగులు ప్రలోభాలకు లొంగవద్దు. ఆరోగ్యం జాగ్రత్త. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఆదాయం బాగుంటుంది. అనుకోని ఖర్చులు పెరుగుతాయి.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

శుభకార్యాలలో పాల్గొంటారు. అదనపు ఖర్చులు తప్పనిసరిగా ఉంటాయి. ఆహ్వానాలు నోటీసులు అందుకుంటారు. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త. విద్యా ప్రగతి బాగుంటుంది. కుటుంబసౌఖ్యం కలదు. పనులు సక్రమంగా సానుకూలంగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలు సామాన్యంగా జరిగి సామాన్య ఆదాయం ఉంటుంది. మంచి ఆర్థికావకాశాలు చేజారిపోవచ్చును.

# బాబు ఇంటర్వ్యూలో పాసైన సోమిరెడ్డి

శ్రీను గల్పిక

***జరిగిన కథ:** అమరావతి రాజధానిలోని తన క్యాంప్ కార్యాలయంలో హైటెక్‌రత్న, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రులు పి.నారాయణ, యనమల రామకృష్ణుడు, స్పీకర్ కోడెల శివప్రసాద్ రావులు మంత్రివర్గ సభ్యుల తీసివేతకు, ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. ఇంటర్వ్యూలో ఫెయిలైన బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, రావెళ్ల కిషోర్‌బాబు, పీతల సుజాత, కిమిడి మృణాళినిలను మంత్రి వర్గం నుండి తొలగిస్తారు. వైసిపి నుండి వచ్చిన నలుగురు ఎమ్మెల్యేలతో పాటు సీనియర్ కోటాలో కిమిడి కళావెంక్రటావ్‌ను, అలాగే రిజర్వేషన్ కోటాలో ఎస్సీ, బీసీ ఎమ్మెల్యేలను ఇంటర్వ్యూ నుండి మినహాయిస్తారు. లోకేష్‌ను కూడా ఇంటర్వ్యూ నుండి మినహాయించాలన్న నారాయణ ప్రతిపాదనను చంద్రబాబు తిరస్కరిస్తాడు. అతనికి కూడా ఇంటర్వ్యూ పెట్టాలని, తన కొడుకు సామర్థ్యానికి పరీక్ష కాబట్టి తాను ఆ ఆపరేషన్‌కు దూరంగా వుంటానని చెబుతాడు. ఆ తర్వాత...*

ఇక మిగిలింది లోకేష్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలే కాబట్టి మొదట లోకేష్‌ను పిలిచారు. ఓ ఉద్యోగం కోసం వచ్చినట్టుగానే లోకేష్ ఇంటర్వ్యూకు వచ్చాడు. యనమల రామకృష్ణుడు మొదటి ప్రశ్న వేశాడు. పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుందని అడిగాడు. ఇక్కడ యనమల గణితం లాజిక్‌తో ప్రశ్న అడిగాడు. పది పక్కన సున్నా పెడితే వంద అవుతుందని చెబుతారు. కాని లోకేష్‌ను కన్ఫ్యూజ్ చేయడానికి పది మధ్యలో సున్నా పెడితే ఏమవుతుందని అడిగాడు. కాని, లోకేష్ వీళ్ళకు దిమ్మ తిరిగే విధంగా పది మధ్యలో సున్నా పెడితే 'పంది' అవుతుందని చాలా లాజిక్‌గా చెప్పాడు. అతని తెలివికి ఈ ముగ్గురూ ఆశ్చర్యపోయారు. తర్వాత నారాయణ వుండి... రెండురెళ్ళు ఎంత? అని అడిగాడు. లోకేష్ ఏ మాత్రం తడుముకోకుండా 'ఆరు' అని ఆన్సర్ చెప్పాడు. ఆ సమాధానంతో నారాయణ డైలమాలో పడ్డాడు. నా స్కూళ్లలో, కాలేజీలలో ఇంత కాలం రెండురెళ్ళు నాలుగు అనే చెబుతున్నారు, కొన్ని లక్షల మంది విద్యార్థులకు ఇదే లెక్క చెప్పాము... ఇంతకాలం మేమే మన్నా తప్పు లెక్క చెప్పామా? లేకపోతే లోకేష్ అంత ఖచ్చితంగా 'ఆరు' అని వెంటనే చెప్పడు. ఎంతయినా మేధావుల కుటుంబంలో పుట్టినవాడు కదా అని మనసులో అనుకుంటూ, ఎందుకైనా మంచిది, సందేహం తీర్చుకుంటే పోతుందని యనమల రామకృష్ణుడి చెవి దగ్గరగా నోరు పెట్టి... అన్నా, లోకేష్ చెప్పిన 'రెండురెళ్లు ఆరు' రైటేనంటారా? అని నెమ్మదిగా అడిగాడు. అందుకు యనమల... లోకేష్ చెప్పినా, చంద్రబాబు చెప్పినా అది నిజమే అయి వుంటుంది... అదీగాక 'రెండు రెళ్ళు ఆరు' అనే సినిమా కూడా వుంది. 'రెండురెళ్లు ఆరు' కాకపోయి వుంటే అదే టైటిల్‌తో అంత డబ్బు ఖర్చుపెట్టి సినిమా ఎందుకు తీసుంటారని గట్టిగా చెప్పాడు. దాంతో నారాయణకు కూడా ఆ ఆన్సర్ మీద నమ్మకం కుదిరి, ఓకే వెరీగుడ్, బాగా చెప్పావు. యువార్ సెలక్టెడ్ అని చెప్పి పంపించారు.

ఆ తర్వాత సోమిరెడ్డి వంతు వచ్చింది. ఇక ఎలక్షన్‌కు రెండేళ్లే వుంది. ఈ రెండేళ్లలో బాగా తిరగాలి. కాబట్టి మంత్రి అయ్యేవాళ్లకు ఫిట్‌నెస్ వుండాలి. అందుకని ముందుగా సోమిరెడ్డికి రన్నింగ్ రేస్ పెట్టారు. వెయ్యిమీటర్ల దూరాన్ని ఒక్క నిముషంలో పరుగెత్తాలి. సాధారణంగా ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్స్ కొట్టినవాళ్లు కూడా ఇలా పరుగెత్తలేరు. నారాయణ ప్రోద్బలంతో చంద్రబాబు ఆ పరీక్ష పెట్టాడు. సోమిరెడ్డి కళ్లు మూసుకుని ఒక్క నిముషం భగవంతుడిని ప్రార్థించాడు. తర్వాత రన్నింగ్ ట్రాక్ మీదకొచ్చి నిలబడ్డాడు. కోడెల విజిల్ వూదాడు. డిస్కవరీ ఛానల్‌లో జింకను వేటాడే చిరుతలా సోమిరెడ్డి పరుగు మొదలుపెట్టాడు. అప్పుడే పడమర గాలి కూడా బలంగా వీయసాగింది. ఆ గాలి దెబ్బకు సోమిరెడ్డి గాల్లోనే తేలుతూ అర నిముషంలోనే వెయ్యి మీటర్ల పరుగును కంప్లీట్ చేసాడు. రన్నింగ్ అయ్యాక డాక్టర్ జడ్.శివప్రసాద్ సోమిరెడ్డి వద్దకు వచ్చి... సార్, ఇందాక కళ్లు మూసుకుని ఎవర్ని ప్రార్థించారని అడిగాడు. ఇంకెవరు... ఇలాంటి సమయాల్లో ఆదుకునేది వాయుదేవుడే కదా, ఆయననే ప్రార్థించాను, ఆయన కరుణించబట్టే పడమర గాలితోలి ఈ రన్నింగ్ ఈవెంట్‌లో సక్సెస్ కాగలిగాను. వాయుదేవుడి సపోర్ట్ లేకుంటే మనం ఇక్కడే వెనుదిరగాల్సివచ్చేదని సోమిరెడ్డి చెప్పి, ఇంటర్వ్యూకు క్యాంప్ కార్యాలయంలోకి వెళ్లాడు. అక్కడ చంద్రబాబుతో పాటు నారాయణ, కోడెల, యనమల ఉన్నారు. చంద్రబాబుతో నారాయణ వుండి... ఈ ఇంటర్వ్యూలో మీరెవరూ కలుగజేసుకోవద్దు, అన్ని ప్రశ్నలు నేనే వేస్తాను, అన్నింటికి ఆన్సర్లు చెబితేనే సెలక్ట్ చేద్దామన్నాడు. మిగతావాళ్లు అందుకు సరేనన్నారు. నారాయణ ప్రశ్నలేసాడు. నెల్లూరు నగరంలో వున్న మొత్తం ముదురుదోమల సంఖ్య ఎంత? అని అడిగాడు. వెంటనే సోమిరెడ్డి... నెల్లూరుటౌన్, రూరల్ నియోజకవర్గాలు కలిపా... లేక కార్పొరేషన్ పరిధిలో వున్న 54డివిజన్‌లలోనివా? అని ఎదురుప్రశ్న వేసాడు. ఓన్లీ కార్పొరేషన్‌లోని 54డివిజన్‌లలో వున్నవే చెప్పు అని నారాయణ అడిగాడు. అప్పుడు సోమిరెడ్డి 'ఠాగూర్' సినిమాలో చిరంజీవి లెవల్లో చేతులుకట్టుకుని... 54డివిజన్‌లలో వున్న దోమలు 8కోట్ల 94లక్షల 66వేల ఏడువందలయాభైరెండు... అలాగే నెల్లూరు జిల్లాలో వున్న దోమల సంఖ్య 92కోట్ల 14లక్షల 93వేల యాభై మూడు... నెల్లూరు కార్పొరేషన్‌లో వున్న మొత్తం పందులు 4లక్షల 27వేల నూట పదహారు, నెల్లూరులో వున్న ఆటోలు 32వేల 16వందల నలభైనాలుగు, బైక్‌లు ఒక లక్షా రెండువేల 602, నెల్లూరులో వున్న మొత్తం కోతుల సంఖ్య 7లక్షల 12వేల నాలుగు వందల అరవై నాలుగు... అని చెప్పుకుంటూ పోతుండగా... చంద్రబాబు కలుగజేసుకుని ఇక చాలు చాలు... నెల్లూరు మీద నీకున్న పట్టుకు ఈ సమాధానాలే నిదర్శనం. గుడ్ బాగా చెప్పావ్ అని కితాబిచ్చాడు. నారాయణ కిమ్మనకుండా ఇంకో ప్రశ్న వేసాడు. నీకు అవకాశమిస్తే ఈ ప్రపంచాన్ని ఎన్ని రోజుల్లో చుట్టి రాగలవని అడిగాడు. వెంటనే సోమిరెడ్డి... అరనిముషం చాలు అని చెప్పాడు. ఎలా అని అందరూ ఆశ్చర్యంగా ప్రశ్నించారు. ఇలా అంటూ సోమిరెడ్డి చంద్రబాబు చుట్టూ ఓ రౌండ్ కొట్టి... నా దృష్టిలో ప్రపంచమంటే చంద్రబాబే... ఆయనను మించిన అద్భుత ప్రపంచం ఇంకొకటి లేదు. నాకు ఆయనను చూస్తే ప్రపంచాన్ని చూసినట్లే వుంటుంది. ఆయనను చదివితే ప్రపంచాన్ని చదివినట్లే వుంటుందని చెప్పాడు. సోమిరెడ్డి సమాధానంతో చంద్రబాబు కళ్లల్లో కన్నీళ్లు సుడులు తిరిగాయి. ఆయన కళ్లు తుడుచుకుంటూ... నా చేత డైమండ్‌ను టెస్ట్ చేయించారు, డైమండ్ ఎప్పటికీ డైమండే అంటూ సోమిరెడ్డి భుజంతట్టి గోహెడ్ అని లేచాడు. సోమిరెడ్డి బయటకు వచ్చాక జడ్.శివప్రసాద్ ఆయన వద్దకెళ్లి... సార్, లోపల ఇంటర్వ్యూ అంతా చూసాను... నారాయణ వేసిన ప్రశ్నలకు మీరు టకటక సమాధానాలు చెప్పారు. మీరు చెప్పిన దోమలు, పందుల లెక్కలు కరెక్టేనా? అని అడిగాడు. దానికి ఆయన నాకు మాత్రం ఏం తెలుసు అని అన్నాడు. మరి నారాయణ ఈ విషయం పసిగట్టలేదా అని సందేహం వెలిబుచ్చాడు జడ్.యస్. అందుకు సోమిరెడ్డి... వాళ్ళు వేసే ప్రశ్నలకు ఆన్సర్‌లు వాళ్లకు కూడా తెలియవనే విషయం నాకు తెలుసు. అందుకే నోటికొచ్చినట్లు చెప్పాను. ఇలాంటి ప్రశ్నలకు ఇలాగే సమాధానం చెప్పాలి. పద నెల్లూరు అంటూ బయలుదేరాడు.

# తాగునీటి కష్టాలను తీర్చండి

## - కలెక్టర్‌కు ఎమ్మెల్యే ప్రతాప్ విన్నపం



కావలి నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు ఈ మండువేసవిలో తాగునీటి కోసం నానా కష్టాలు పడుతున్నారని, మంచినీటి సమస్యలు తీర్చి ప్రజలను ఆదుకోవాలని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టర్ ఆర్. ముత్యాలరాజుకు విన్నవించారు. బుధవారం ఆయన నెల్లూరులోని కలెక్టర్ బంగ్లాలో జిల్లా కలెక్టర్‌ను కలుసుకుని తాగునీటి సమస్యలను వివరించారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులకు సోమశిల జలాలు పంపిణీ చేయాలని ఆయన కోరారు. తుమ్మలపెంట సిపిడబ్ల్యుఎస్ ద్వారా నీరు సరఫరా కావడం లేదని, 20 గ్రామాలకు ఇంకా పైపులైన్లు వేయలేదని, తాత్కాలికంగా తుమ్మలపెంట, తాళ్ళపాళెం చెరువులకు నీటిని పంపి తీరప్రాంత ప్రజలకు పైలెట్ ప్రాజెక్టు బోర్లకు మంచినీరు అందేవిధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా, మందాటి చెరువును సెకండ్ సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌గా మార్చేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. డిఆర్, డిఎం ఛానల్స్‌ను త్వరగా చేపట్టాలన్నారు. జక్కేపల్లి గూడూరు ఎస్ఎస్ ట్యాంక్ పనిని త్వరగా పూర్తిచేసి అల్లిమడుగు, తెల్లగుంట, ఉమామహేశ్వరపురం గ్రామాలకు వచ్చే ఏడాదికైనా పుష్కలంగా తాగునీరందించాలని ఆయన కోరారు. నకిలీ విత్తనాలు పొంది నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. డయాలసిస్ సెంటర్, సదరన్ క్యాంప్‌లను కావలిలో ఏర్పాటు చేయాలన్నారు. చెన్నాయపాళెంలో విషజ్వరాల నివారణకు వైద్యబృందాన్ని పంపే ఏర్పాటు చేయాలని ఆయన కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ముసునూరు 926 సర్వే నెంబర్‌లో వున్న పట్టాదారుల సమస్యలు తీర్చి, వారు అక్కడ ఇళ్ళు కట్టుకునేందుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, కనుమర్లపూడి వెంకటనారాయణ, దండ కృష్ణారెడ్డి, కేతిరెడ్డి జగదీశ్వరరెడ్డి, వాకా శ్రీనివాసులురెడ్డి, కర్తం సురేంద్రరెడ్డి, సుంకే మాల్యాద్రి, గండవరపు రాజశేఖరరెడ్డి, పరుసు మాల్యాద్రి, శ్రీను పాల్గొన్నారు.



## కావలి కబుర్లు



# సముద్ర ఉత్పత్తుల అభివృద్ధికి కృషి

## - బీదా మస్తాన్‌రావు

సముద్ర ఉత్పత్తుల అభివృద్ధికి సమిష్టి కృషి ఎంతో అవసరమని నవ్యాంధ్ర రాజధాని నిర్మాణ సలహా కమిటీ సభ్యుడు, కావలి మాజీ ఎమ్మెల్యే బీద మస్తాన్‌రావు అన్నారు. వాకాడు మండలంలోని తూపిలిపాళెం గ్రామంలో కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి సుజనాచౌదరి, రోడ్లు భవనాల మంత్రి సిద్దా రాఘవరావు, మత్స్యశాఖ మంత్రి ఆదినారాయణరెడ్డి, జిల్లా మంత్రులు పి. నారాయణ, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలతో కలసి బీదా మస్తాన్‌రావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన జాతీయ సముద్ర సాంకేతిక అంశాలను వారికి వివరించారు. మత్స్యశాఖ సహకారంతో అమలుచేస్తున్న కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఇక్కడి సముద్ర ఉత్పత్తులను సేకరించి, వాటిని అభివృద్ధి చేసేందుకు ఏర్పాటుచేసిన బృందాలతో ఆయన చర్చించారు. ఆక్వాకల్చర్‌పై తనకున్న అనుభవాన్ని వారికి ఈ సందర్భంగా బీదా వివరించి అందరి ప్రశంసలు అందుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన సెరిమోని ఫర్ హ్యాచరీ బాల్ లాస్ట్ వాటర్ ట్రీట్‌మెంట్ టెస్ట్ ఫెసిలిటీకి జరిగిన శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. మత్స్యపరిశ్రమలో వెనామీ ప్రక్రియ విప్లవాత్మకమైన మార్పు తెచ్చిందని, దానివల్ల సుమారు 45వేల కోట్ల రూపాయల దాకా వ్యాపారం జరుగుతుందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థను ఎంతగానో ప్రభావితం చేసే అంశమని ఆయన వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే పరసా వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

# గీతాంజలి పాఠశాల రజతోత్సవం



నెల్లూరు బాలాజీనగర్‌లోని శ్రీ గీతాంజలి ఇంగ్లీషు మీడియం హైస్కూల్‌లో ఈ నెల 11వ తేదీ రజతోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ బీద రవిచంద్ర, నగర మేయర్ అబ్దుల్ అజీజ్, టీడీపీ నగర అధ్యక్షులు కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, సినీ గేయరచయిత వెన్నెలకంటి, విద్యాశాఖాధికారులు, వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. విద్యార్థులు విద్యతో పాటు దేశభక్తి, మానవతా విలువలు, మంచి నడవడికను పెంపొందించుకుని దేశ ప్రగతికి తోడ్పడాలని వక్తలు తమ ఉపన్యాసంలో పేర్కొన్నారు. పాఠశాల వ్యవస్థాపకులు వై.వెంకటరామయ్య మాట్లాడుతూ తమ పాఠశాలలో మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతూ విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు, పాటలు, దేశభక్తి గీతాలు అందరినీ అలరించాయి.

# గుర్రాల రమణమ్మ స్మారక సాహితీ పురస్కారాలు



నెల్లూరు దర్గామిట్ట సరస్వతినగర్‌లోని ఐఎంఏ హాలులో ఈ నెల 9వ తేదీ గుర్రాల రమణమ్మ స్మారక సాహితీ పురస్కారాలు అందజేశారు. స్మారక పురస్కారాలను రేలంగి కుమార్ శంకర్‌గౌడ్, డా॥ ఉదయకుమార్, డా॥ శేషారత్నం, డా॥ రాజమోహన్‌రెడ్డి, వై.శైలజ, పొత్తూరి జయలక్ష్మి, వంగిపురం శారదాదేవి, కొర్రపాటి వెంకటరమణయ్య, జి.సుభద్రాదేవి, గద్దెబాల సుందరం అందుకున్నారు. వీరిని మెమెంటో, శాలువాలతో జి.ఆర్.ట్రస్ట్ అధ్యక్షులు గుర్రాల రమణయ్య ఘనంగా సత్కరించారు.

# సుందరమైనది.. ‘సుందరకాండ’

వాల్మీకి రామాయణం ఎంతో పవిత్రమైనదని, రామాయణంలోని ప్రతిఅక్షరం ఎంతో విశిష్టమైనదని, అందులో సుందరకాండ మరెంతో సుందరమైనదని ప్రముఖ అవధాని కోట రాజశేఖర్ అన్నారు. ఇటీవల ఆయన టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో, నెల్లూరు రామ్మూర్తినగర్‌లోని శ్రీ సత్యసాయి భజనమందిరంలో ఆధ్యాత్మికోపన్యాసం చేస్తూ ‘సుందరకాండ’ వైశిష్ట్యాన్ని అత్యద్భుతంగా వివరించారు. సుందరకాండ పారాయణం ఎంతో పుణ్యప్రదమని ఆయన అన్నారు.




సుందరకాండ ప్రారంభం నుంచి చివరి వరకు హనుమ చూపిన దైవభక్తి, స్వామిభక్తి అపూర్వమన్నారు. లక్ష్యశుద్ధి, పట్టుదల, అవిశ్రాంత కృషి, సమయస్ఫూర్తి, ప్రతాపం, యుక్తాయుక్త వివేచన, ధైర్యం, బుద్ధి సంపద, వినయం, నేర్పరితనం, మధురమైన మాట తీరు, కృతజ్ఞతాభావం తదితర సుగుణాలన్నీ ఎంతో ప్రశంసనీయమైనవన్నారు. భక్తితో హనుమను సేవిస్తే అలాంటి సుగుణాల్లో కొన్నైనా మనకు సిద్ధిస్తాయన్నారు. సుందరకాండ పారాయణం ద్వారా కోరుకున్న కార్యాలు జయప్రదమవుతాయని, పోగొట్టుకున్నవి తిరిగి లభిస్తాయన్నారు. అనంతరం అవధాని రాజశేఖర్‌ను భజన మందిరం కన్వీనర్ మన్నెం శ్రీనాథ్‌రెడ్డి, ధన్‌సింగ్ ఘనంగా సత్కరించారు.

# ఏసి వాకర్స్‌కు క్యాన్సర్‌పై అవగాహన



నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీ అపోలో ఆసుపత్రి డాక్టర్ హరిత క్యాన్సర్ వ్యాధిపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డా॥ హరిత మాట్లాడుతూ గతంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారించిన తరువాత మనిషి జీవితం అయిపోయిందని భావించేవారని, ప్రస్తుత పరిస్థితుల్లో అనేక పద్ధతుల్లో క్యాన్సర్‌ను నయం చేయవచ్చన్నారు. పొగతాగడం, మద్యం సేవించడం, ఊబకాయం, కెమికల్ ఫ్యాక్టరీలలో పనిచేసేవారికి క్యాన్సర్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. స్త్రీలలో 40సంవత్సరాలు పైబడిన వారికి బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని, 80సంవత్సరాల మహిళల్లో కూడా ఒక శాతం వచ్చే అవకాశం ఉందన్నారు. 20సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ క్యాన్సర్ పరీక్ష చేయించుకోవాలని, శరీరంలో ఒక అవయవభాగం తీసి బయాప్సీ చేసినందువల్ల క్యాన్సర్ వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వేలూరు రంగారావు, కార్యదర్శి స్వర్ణ, రమేష్‌బాబు, కోశాధికారి పొన్నం రవిచంద్ర, ఎస్.రాఘవేంద్రషెట్టి, నలుబోలు బలరామయ్యనాయుడు, అంకిరెడ్డి, సత్యనాథ్, షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.



మహాత్మా జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని ఇటీవల నెల్లూరు బార్ అసోసియేషన్‌కు మహాత్మా జ్యోతిరావు పూలే చిత్రపటాన్ని బహుకరిస్తున్న న్యాయవాది జి.వి.నరసయ్య

# నేత్రపర్వంగా వేణుగోపాలుడి బ్రహ్మోత్సవాలు



నెల్లూరు మూలాపేటలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాలస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. 6వ తేదీ రాత్రి అంకురార్పణతో కార్యక్రమాలు మొదలయ్యాయి. 7వ తేదీ శేష వాహనం, 8వ తేదీ హంస వాహనం, 9వ తేదీ చంద్రప్రభ, 10వ తేదీ వెండి హనుమంతుసేవ, 11వ తేదీ గరుడ సేవ, 12వ తేదీ ఉదయం స్వామి వారికి విశేషపూజలు, స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు చైతన్య అవధాని, సంపత్‌స్వామి, రమాకాంత్ స్వామి ఆధ్వర్యంలో మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ భక్తుల కోదండరామ నామ స్మరణలతో వైభవంగా జరిగింది. ఉభయకర్తలుగా ప్రముఖ దాత వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి - ప్రశాంతిరెడ్డి దంపతులు వ్యవహరించారు. 13వ తేదీ రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా హోమాలు, వేదపూజలు, స్నపన తిరుమంజనం సేవలు జరిగాయి. తెనాలి బ్యాండు, కీలుగుర్రాలు, విచిత్ర వేషధారణలు, మంగళవాయిద్యాలు, విశేష పుష్పా లంకారాలతో స్వామివారి నగరోత్సవం జరిగింది. దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్తల మండలి ట్రస్టీలు ఆనం వివేకానందరెడ్డి, మజ్జిగ చంద్రమౌళి, మేనేజర్ గిరికృష్ణ పర్యవేక్షించారు.

# బాబు పరువు తీశాడు

(మొదటి పేజీ తరువాయి)

ఫిరాయింపులను ప్రోత్సహిస్తే వెంకయ్య దృష్టిలో పలుచన అవుతానని కూడా చంద్ర బాబుకు అనిపించినట్లు లేదు. పార్టీ ఫిరాయింపులను తీవ్రంగా వ్యతిరేకించే వెంకయ్యనాయుడు చంద్రబాబు పర్య వేక్షణలో జరిగిన ఫిరాయింపులపై ఎలా స్పందిస్తాడో కూడా చూడాల్సి వుంది.

వైసిపి ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చు కోవడం, వారిచేత రాజీనామాలు చేయించ కుండానే మంత్రి పదవులు ఇవ్వడం ద్వారా చంద్రబాబు రాష్ట్రంలో ఓ దుష్ట సంప్ర దాయానికి శ్రీకారం చుట్టారు. రాజ్యాంగ విలువలను కాపాడాల్సిన గవర్నర్ కూడా ఫిరాయింపు ఎమ్మెల్యేల చేత మంత్రులుగా ప్రమాణస్వీకారం చేయించడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి.

ఇదంతా ఒకెత్తయితే పార్టీ ఫిరాయిం పుల ద్వారా ఏపిలోనే కాదు, ఢిల్లీ వీధు ల్లోనూ చంద్రబాబు పరువు పోయింది. ఇంతకాలం నేను నిప్పును అంటూ చంద్ర బాబు చెప్పుకుని తిరిగాడు. జాతీయ రాజ కీయాలలో చంద్రబాబుకు దండిగానే పరిచయాలున్నాయి. 1996లో కేంద్రంలో 13రోజుల వాజ్‌పేయి ప్రభుత్వాన్ని కూల గొట్టి యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో కీలకపాత్రధారి చంద్రబాబు. ఆరోజు దేవేగౌడ బదులు తనకు ప్రధాని అవకాశం వచ్చినా చంద్ర బాబు తెలివికలవాడు కాబట్టి వద్దనుకు న్నాడు. ప్రధాని పదవి తీసుకుని వుంటే ఆయన ఈరోజు దేవేగౌడలాగే ఉండే వాడు. యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వంలో చక్రం తిప్పిన చంద్రబాబు, ఆ తర్వాత ఎన్డీఏ ప్రభుత్వంలోనూ కీలక భాగస్వామి అయ్యాడు. కాబట్టే ఆయనకు దేశంలోని అన్ని పార్టీల నేతలతో సంబంధాలున్నాయి. ఇప్పుడు ఢిల్లీ వీధుల్లో బాబు నైజం ఏంటో, ఆయన రాజకీయ దుర్నీతి ఎలాంటిదో అన్ని పార్టీల అధినేతలకు బుర్రకథలు మాదిరిగా చెప్పొచ్చాడు జగన్. రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీతో పాటు బీజేపీ సీనియర్ నాయ కులు, కేంద్రమంత్రి అరుణ్‌జైట్లీ, సమాజ్ వాదీ పార్టీ అధినేత ములాయంసింగ్ యాదవ్, దళ్(యు) అధినేత శరద్‌యాదవ్, వామపక్ష నేతలు సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డిలను కలిసి రాష్ట్రంలో చంద్రబాబు చేసిన ఫిరాయింపు రాజకీయాలను పూస గుచ్చినట్లు వివరిం చారు. రాజకీయాలు ఎంతగా చెడిపో యినా చంద్రబాబు చేసిన పనిని ఎవరూ సమర్ధించరు. ఢిల్లీలో ఆయా పార్టీల అగ్ర నేతలు కూడా జగన్‌కు అపాయింట్‌మెంట్ ఇచ్చి ఆయన చెప్పింది వినడం చంద్ర బాబుకు చిర్రెత్తుకొచ్చింది. తన పరువు తీసాడని జగన్‌పై కోపం వచ్చింది. తన పార్టీలో, ప్రభుత్వంలో బ్యాంకులకు వేల కోట్లు అప్పులు ఎగ్గొట్టిన వాళ్లను పెట్టుకుని వున్న ఆయన ఆర్ధిక నేరగాడికి ఇంట ర్వ్యూలు ఎలా ఇస్తారంటూ ఆయా పార్టీల నేతలపై ఆగ్రహం వెళ్లబుచ్చారు. ఇన్నేళ్ల నుండి ఢిల్లీలో చంద్రబాబు తెచ్చుకున్న ఇమేజ్, జగన్ ఒకే ఒక్కరోజు పర్యటనతో అంతా డామేజీ అయ్యింది.

# ఆశలన్నీ..ఆ మూడింటిమీదే!

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర రాజకీయాలను ఔపాసన పట్టిన నాయకుడు. ఎప్పుడు ఏమి చేయాలో తెలి సిన నాయకుడు. ప్రజల్లో బలం లేక పోయినా, ఆ ప్రజల మద్దతు ఎలా పొం దాలో, ఎన్ని మార్గాలలో రాబట్టాలో తెలిసిన నాయకుడు. అలా తెలిసినవాడు కాబట్టే 2014లో పార్టీ పనైపోయిందను కున్న వాతావరణంలో ఉన్న తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకురాగలిగాడు.

ఈరోజు రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం పట్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వుంది. ప్రజలు కట్టకట్టుకుని ఓట్లేసేంత మంచిపనులేవీ చంద్రబాబు చేయలేదు. ఈ మూడేళ్లలో చేసినవన్నీ కూడా సొం తంగా ఆర్ధిక వనరులు కూడగట్టుకోవ డానికి చేసినవే! ప్రజల్లో వ్యతిరేక వాతా వరణం బాగానే కనిపిస్తోంది. అయినా కూడా రాష్ట్రంలో ఈసారి ఎన్నికలు ఏక పక్షంగా జరగాలనే కాంక్ష చంద్రబాబులో కనిపిస్తోంది. ఇందుకు ఆయన ఎంచుకున్న మార్గాలు మూడు.

మొదటిది రాష్ట్రంలో నియోజకవర్గాల సంఖ్యను 175 నుండి 225కు పెంచడం. ఇలా చేస్తే తెలుగుదేశంలో పున్నోళ్లకు, కాంగ్రెస్, వైకాపాల నుండి చేరినోళ్లందరికీ సీట్లొస్తాయి. డబ్బు ఖర్చుపెట్టే అభ్యర్థులకు తెలుగుదేశంలో లోటు లేదు. కాని వైకాపాకు అలాంటి అభ్యర్థుల కొరత ఉంటుంది. ఇక్కడ ప్రతిపక్షం మొదటి దెబ్బ తింటుంది. తెలుగుదేశం తరపున అన్ని నియోజక వర్గాలలోనూ బలమైన అభ్యర్థులు నిల బడతారు.

రెండోది... పవన్ కళ్యాణ్ ద్వారా ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీల్చడం. 2014లో చంద్రబాబు అధికారంలోకి రావడంలో ప్రధాన కారణాలలో పవన్ కళ్యాణ్ ఒకడు. ఆరోజు ఆయన బీజేపీతో పాటు రాష్ట్రంలో తెలుగుదేశంకు కూడా మద్దతు పలికాడు. దీంతో పవన్ అభిమా నులతో పాటు కాపుల ఓట్లు కూడా తెలుగుదేశంకు పడ్డాయి. ఈ మూడేళ్లలో కాపులు చంద్రబాబుకు వ్యతిరేకమయ్యారు. కాపులకు బి.సి రిజర్వేషన్లు అమలు చేస్తామన్న బాబు మాట గాలిమూటే అయ్యింది. కాపు రిజర్వేషన్ ఉద్యమాలను చంద్రబాబు బలంగానే అణచివేసాడు. ఈసారి కాపుల ఓట్లు తెలుగుదేశంకు పడవని చంద్రబాబుకు తెలుసు. అయితే ఆ ఓట్లు వైకాపాకు పోతే చంద్రబాబుకు డేంజర్. వాటిని డైవర్ట్ చేయాలి. అందుకు ఆయన ముందున్న మార్గం పవన్ కళ్యాణ్ జనసేన చేత పోటీ చేయించడం. దీనివల్ల కాపుల ఓటును వైకాపాకు పోకుండా చేయడంతో పాటు ప్రభుత్వ వ్యతిరేక ఓటును వైకాపా, జనసేనల మధ్య చీల్చి తెలుగుదేశాన్ని లబ్ధిపొందేలా చేయడం.

ఇక మూడోమార్గం అందరికీ తెలి సిన డబ్బు. ఎన్నికలంటేనే దీని పాత్ర ప్రధానమైపోయింది. ఇప్పుడు తెలుగుదేశం నాయకుల దగ్గర ఇది పుష్కలంగా వుంది. మొన్న స్థానిక సంస్థల ఎన్నికలలోనే ఒక్కో జిల్లాలో ఎన్నేసికోట్లు ఖర్చుపెట్టారో చూసాం. 2014 ఎన్నికల్లోనూ తెలుగు దేశం గెలుపులో డబ్బు ప్రభావం బాగానే పనిచేసింది. ఐదేళ్లు అధికారంలో ఉం డడం వల్ల తెలుగుదేశంపార్టీ ఆర్ధికంగా ఇంకా పుంజుకుంటుంది. కాబట్టి వచ్చే ఎన్నికల్లో చంద్రబాబు ఆర్ధిక శక్తులను బాగానే ప్రయోగిస్తాడు.

ప్రజల్లో బలం లేకున్నా, ప్రజాకర్షక పథకాలు ఏవీ లేకున్నా, అవినీతి అక్ర మాలు పోటెత్తుతున్నా, రాష్ట్రంలో కరువు విలయతాండవం చేస్తున్నా... చంద్ర బాబుకు వచ్చే ఎన్నికలో మనదే అధికారం అని బల్లగుద్ది చెప్పడానికి బలమైన కారణం ఈ మూడుమార్గాలను బలంగా నమ్ము తుండడమే!

కనుల పండువగా...

# చెన్నకేశవుని రథోత్సవం



వింజమూరులోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ఈ నెల 13వ తేదీన స్వామివారి రథోత్సవం కిక్కిరి సిన భక్తజన సందోహం మధ్య జరిగింది. రథాన్ని లాగడానికి భక్తులు పోటీపడ్డారు. దేవస్థానం నుండి మొదలైన రథోత్సవం ఎర్రబల్లిపాలెం, కొత్తూరు, కామాటివీధుల గుండా గంగమిట్ట దాకా సాగి తిరిగి దేవ స్థానంకు చేరుకుంది. రథోత్సవం సంద ర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘట నలు జరగకుండా పోలీసులు గట్టి బందో బస్తు ఏర్పాటు చేశారు.

ఈ నెల 7వ తేదీన అంకురార్పణతో చెన్నకేశవస్వామి తిరునాళ్ళు మొదల య్యాయి. 8వ తేదీ ధ్వజారోహణ, 9వ తేదీ కొత్తూరు వాసులు ఉభయకర్తలుగా పొన్న వాహనోత్సవం, 10వ తేదీ పాతూరు వాసులు ఉభయకర్తలుగా హనుమంతుసేవ, 11వ తేదీ నడిమూరు వాసులు ఉభయకర్తలుగా గరుడసేవ, 12వ తేదీ ఎర్రబల్లిపాలెం వాసులు ఉభయకర్తలుగా కళ్యాణోత్సవం వైభవంగా జరిగాయి. ఈ ఉత్సవాలను తిల కించడానికి చుట్టుపక్కల గ్రామాల నుండి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చారు.

# అలరించిన రెయిన్‌బో వేడుకలు



నెల్లూరు, మాగుంట లేఅవుట్‌లోని రెయిన్‌బో స్కూల్ 12వ వార్షికోత్సవ వేడుకలు 12వ తేదీ అనిల్‌గార్డెన్స్‌లో అత్యంత కోలాహలంగా జరిగాయి. ప్లేక్లాస్, నర్సరీ, ఎల్‌కెజి, యూకెజి చిన్నారులకు కలర్స్ పేరుతో ఈ కార్యక్ర మాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ముత్యాల రాజు దంపతులు ఈ కార్య క్రమంలో పాల్గొని నేటి విద్యావిధానాలపై ఉపన్యసించారు. పిల్లలకు నాలుగు మంచి మాటలు చెప్పారు. అనంతరం దేశంలోని వివిధ నృత్యులు, సంస్కృతులు, గ్రామీణ భారత జీవన శైలిని తలపించే విధంగా చిన్నారులు వేసిన ప్రదర్శనలు అబ్బురపరిచాయి. స్కూల్ కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం, డైరెక్టర్ పద్మ సుబ్రహ్మణ్యం, ప్రిన్సిపాల్ అరుణ స్వయంప్రభ, ప్రీప్రైమరీ స్కూల్ ఇన్‌ఛార్జ్ షాతిమాఖాన్, కొరియోగ్రాఫర్ అనూరాధలు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

# ఆనం ఆశలపై నీళ్ళు!

(5వ పేజీ తరువాయి)

మీకంటే మేం సీనియర్లం, మాపై పెత్తనం చెలాయించాలంటే కుదరదు అన్నట్లుగా వున్నారు. అదీగాక ఒకప్పుడు తాము లెక్కలేకుండా చూసిన మంత్రి నారాయణ వద్దకే ఇప్పుడు ఏ పని కావాలన్నా పోవాల్సి వస్తోంది. ఇది వాళ్లకు బాగా ఇబ్బంది కలిగించే విషయమే! తెలుగుదేశంలో చేరాక ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బాధ్యతను ఆనం రామనారాయణరెడ్డికి అప్పగించడం తప్పితే రాజకీయంగా వారికి ఇక ప్రాధాన్యత నిచ్చిందేమీ లేదు. నెల్లూరు నగరం, రూరల్ నియోజకవర్గాల్లో వేలు పెట్టొద్దని చెప్పారు. కార్పొరేషన్ వ్యవహారాలలో అసలు కలుగజేసుకోవద్దని సంకేతాలు అందాయి. కార్పొ రేషన్‌లో కెలకనిదే ఆనం వివేకాకు నిద్రపట్టదు. పుండు మీద యాసిడ్ పోసినట్టు ఈమధ్య విఆర్ విద్యాసంస్థల కమిటీని రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పు ఒకటి మరింత బాధ కలిగిస్తోంది.

చంద్రబాబు ఏదన్నా కనికరించి ఎమ్మెల్సీ ఇస్తాడనుకుంటే అది కూడా అందని ద్రాక్షలాగే వుంది. ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ రాలేదు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీని వాకాటికిచ్చారు, మేలో గవర్నర్ కోటా క్రింద రెండు ఎమ్మెల్సీలను భర్తీ చేయాల్సివుంది. దీంట్లో ఒకటి ఆనం సోదరులకు వచ్చి వుండేదే! అయితే కడపలో వైసిపి నుండి వచ్చిన ఆదినారాయణరెడ్డికి మంత్రి పదవి ఇవ్వడాన్ని రామసుబ్బారెడ్డి వ్యతిరేకించారు. ఆయనను చల్లబర్చడానికి ఒక ఎమ్మెల్సీ ఇస్తామని హామీ ఇచ్చారు. వాస్తవానికి చంద్రబాబు ఆర్టీసీ ఛైర్మెన్ పదవిని రామసుబ్బారెడ్డికిచ్చి, ఎమ్మెల్సీని ఆనం వాళ్లకు ఇవ్వాలనుకున్నాడు. అయితే రామసుబ్బారెడ్డి ఆర్టీసీ ఛైర్మెన్‌కు లొంగకుండా ఎమ్మెల్సీకి రాజీపడ్డాడు. దీంతో ఉన్న రెండు ఎమ్మెల్సీలలో ఒకటి రెడ్లకు ఇస్తే, రెండోది ఇతర కులాలకు ఇవ్వక తప్పదు. ఉన్న ఒక్క ఎమ్మెల్సీ విషయంలో ఆనం బ్రదర్స్‌కు ఇక్కడ గండిపడింది. ఇక ఎన్నికల దాకా మధ్యలో పదవులొచ్చేదీ లేదు, పెట్టేదీ లేదు. ఎలక్షన్‌లో ఆత్మకూరు సీటు ఇవ్వడం తప్పించి ఆనం బ్రదర్స్‌కు చంద్రబాబు అంతకుమించి ఏమీ చేయడు.



# ఇంటర్‌లో 'రత్నం' విజయపతాక

***నెల్లూరంటే పెన్నమ్మ ఒడి... రంగడి గుడి... రత్నం బడి... నిజమే నెల్లూరుజిల్లాతో పెన్నానది, రంగనాథస్వామి దేవాలయంకు ఎంత అనుబంధముందో, నెల్లూరు విద్యారంగంలో రత్నం మాష్టారుకూ అంతే అనుబంధముంది. నెల్లూరుజిల్లా విద్యారంగాన్ని చరిత్రపుటల్లో నిలిపింది, ఎంసెట్ ర్యాంకుల్లో ఈ జిల్లాను రారాజుగా నిలబెట్టింది కూడా రత్నం సారే! నెల్లూరుజిల్లా విద్యారంగ చరిత్ర పుస్తకంలో 'రత్నం'ది ఎప్పుడూ మొదటి పేజీనే!***

రత్నం మాష్టారు పిల్లలు కూడా చదువుల్లో ఎప్పుడూ రత్నాలేనని మరోసారి ఋజువైంది. 13వ తేదీ విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్షాఫలితాల్లో 'రత్నం' విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ఫలితాలలో రత్నం విద్యార్థిని యం.లక్ష్మీకీర్తి బైపిసి విభాగంలో 440మార్కులకుగాను 436మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఎన్.వసంతి 432మార్కులు, ఎ.కీర్తిచందన 431మార్కులు సాధించారు. ఎంపిసి విభాగంలో పి.నందిని 470 మార్కులకు గాను 462, షేక్ పర్విన్‌ముస్రఫ్ 462, యన్.తనూజ 460, ఎ.పవిత్ర 460మార్కులు సాధించారు.

అలాగే ద్వితీయ సంవత్సరం బైపిసిలో యం.లక్ష్మీప్రసన్న 1000 మార్కులకు గాను 987, బి.సుమ 987, ఆర్.సాయిమనోజ్ 987 మార్కులు సాధించారు. ఎంపిసి విభాగంలో బి.వి.హారిక 988 మార్కులు, జి.లోకేష్‌కుమార్ 987మార్కులు, జి.రామప్రత్యూష 986మార్కులు, పి.వి.సాయిపూజిత 986 మార్కులు, యం.తేజ 986మార్కులు సాధించారు.

ఈ సందర్భంగా ఇస్కాన్ మందిరం వద్ద రత్నం కాలేజీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను రత్నం సారు అభినందించారు. ప్రణాళికాబద్ధమైన శిక్షణ, సీనియర్ అధ్యాపకుల పర్యవేక్షణలో విద్యాబోధన ద్వారా ఈ ఫలితాలు సాధించగలిగామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు కోరా సార్, ప్రిన్సిపాల్ ప్రభాకర్, అధ్యాపకులు శేఖర్‌నాయుడు, వి.వి.రామకృష్ణ, నాగాంజనేయులు, రమణకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

# మెట్టు దిగాడు... మెట్లెక్కుతున్నాడు!

(మొదటి పేజీ తరువాయి)



సీనియర్ నేత వై.టి.నాయుడుతో సోమిరెడ్డి

వర్గ రాజకీయాలలో ఆరితేరిన అరివీర భయంకర యోధుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిలో మొన్న మంత్రివర్గ విస్తరణ తర్వాత అనూహ్య మార్పువచ్చింది. వర్గ రాజకీయాల మీద ఆయనకే విరక్తి వచ్చింది. మనలో మనం కొట్టుకుని ఏం సాధించగలమనే ప్రశ్న వచ్చింది. అందుకే మంత్రి కాగానే 'మిర్చి' సినిమాలో ప్రభాస్‌లాగా మారిపోయాడు. సొంత పార్టీలోని శత్రువులను మిత్రులుగా మలచుకునే పనిలో పడ్డాడు. మనిషిని మనిషి ప్రేమిస్తేపోయేదేమీ లేదు... మహా అయితే తిరిగి వాళ్ళు కూడా మనల్ని ప్రేమిస్తారు అనే ప్రభాస్ సిద్ధాంతం బాటపట్టాడు. ఈ కోణంలో మొదట సహచర మంత్రి నారాయణనే అభిమానించాడు. మంత్రి కాగానే నారాయణతో ఇప్పటివరకు తనకున్న విభేదాలను తన మైండ్‌గ్యాలరీ నుండి డిలీట్‌చేశాడు. నారాయణను వెంటబెట్టుకుని మీటింగ్‌లలో పాల్గొన్నాడు. నారాయణతో కలిసే వూరేగింపులోనూ పాల్గొన్నాడు. ఈనాటి ఈ బంధమేనాటిదో అన్నట్లు నారాయణతో కలిసిపోయాడు. సోమిరెడ్డి చూపిన ప్రేమ, వాత్సల్యానికి గుండ్రాయిలాంటి నారాయణ గుండె కరిగిపోయింది. 'మిర్చి' సినిమా క్లైమాక్స్‌లో విలన్ మంచిమనిషిగా మారిపోయినట్లు నారాయణ కూడా సోమిరెడ్డి స్నేహం ధాటికి మానవత్వం పరిమళించిన మనిషిగా మారిపోయారు.

ఇక సోమిరెడ్డి అభిమానించిన రెండో నాయకుడు ఆనం వివేకానందరెడ్డి. సోమిరెడ్డి అభినందన సభకు ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఆనం సోదరులు రాలేదు. అయినా సోమిరెడ్డి వారికి దూరం కావాలనుకోలేదు. ఆనం సోదరులతో స్నేహం కావాలనుకున్నాడు. నేరుగా ఆనం వివేకా ఇంటి కెళ్లాడు. జిల్లా రాజకీయాలలో ఇద్దరూ ఇద్దరే! ఒకరికొకరు తీసిపోరు. రాజకీయ నటనలో ఒకరికి నట భీభత్స, ఇంకొకరికి నట విధ్వంస అవార్డులను ఇవ్వొచ్చు. ఎంతో ప్రేమతో తన ఇంటికొచ్చిన సోమిరెడ్డిపై వివేకా కూడా అంతే ప్రేమ చూపించాడు. ఇద్దరూ కలిసి జిల్లాలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని అంతం చేద్దామని ప్రతిజ్ఞ చేశారు.

అలాగే సోమిరెడ్డి జిల్లాలో ఇంకా పలువురు తెలుగుదేశం నాయకుల ఇళ్లకు వెళ్లి స్నేహహస్తం అందించి వచ్చారు. త్వరలో ఆనం రామనారాయణరెడ్డి, ఆదాల ప్రభాకరరెడ్డిల ఇళ్లకు కూడా వెళ్లి నాయకులు స్నేహంగా వుంటే వచ్చే ఉపయోగాలపై హితబోధ చేయనున్నారు. మొత్తంమీద జిల్లాలో జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే జిల్లా తెలుగుదేశంలో ఎవరినీ ప్రత్యర్థులుగా చేసుకోకుండా అందరినీ సమన్వయపరచుకుని ముందుకుసాగాలనే ఆలోచనలో సోమిరెడ్డి ఉన్నట్లుగా తెలుస్తోంది.


శ్రీరస్తు శ్రీ గణేశాయ నమః శుభమస్తు

## శ్రీ షిర్డి సాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల బ్రహ్మోత్సవ ఆహ్వానము

కొత్తూరు గ్రామం, ఇందుకూరుపేట మండలం, నెల్లూరు జిల్లా

తేది 18-04-2017 నుండి 22-04-2017 వరకు జరుగును

విశేష కార్యక్రమ వివరములు



తేది 19-04-2017 బుధవారం ఉ|| గం|| 11-00 లకు

శ్రీ సాయినాథునికి బ్రహ్మకళశాభిషేకం


తేది 21-04-2017 శుక్రవారం సా|| 5-00 నుండి

శ్రీ షిర్డి సాయినాథ, శ్రీరామ, శ్రీ అంజనేయ పరివారదేవతామూర్తుల

రథోత్సవం

తేది 22-04-2017 శనివారం ఉ|| గం|| 11-00 లకు

శ్రీ యోగాంజనేయ స్వామివారికి బ్రహ్మకళశాభిషేకం



ఈ విధముగా జరుగు కార్యక్రమములకు బంధుమిత్ర సమేతంగా విచ్చేసి శ్రీ షిర్డిసాయిబాబా మరియు శ్రీ యోగాంజనేయస్వామి వార్ల తీర్థప్రసాదములు స్వీకరించి, స్వామి వార్ల కృపాకటాక్షములకు పాత్రులు కావలసినదిగా కోరడమైనది.

గమనిక : అన్నప్రసాద వితరణ 18-04-2017 నుండి 22-04-2017 వరకు, ప్రతి రోజు మధ్యాహ్నం 12-00 గం||ల నుండి ప్రారంభం.

ఆహ్వానించువారు : శ్రీమతి కలికి శ్రీలత – శ్రీ కలికి కోదండరామిరెడ్డి, ధర్మకర్తలు


Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com